ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 13 ఫిబ్రవరి 2024



పవన్ ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాతే స్పష్టత

టీడీపీ-బీజేపీ-జనసేన పొత్తు కుదిరిన తర్వాతే సీట్ల ప్రకటన : పొలిట్ బ్యూరో సభ్యుడు, మండలి మాజీ చైర్మన్ షరీఫ్

నరసాపురం, ఫిబ్రవరి 12 : 'రాష్ట్రంలో వైసీపీ వ్యతిరేక పవనాలు బలంగా వీస్తున్నాయి. సర్వేలన్నీ టీడీపీ - జనసేన కూటములకు అనుకూలంగా ఉన్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే రెండు పార్టీలు కలిసి 130కి పైగా స్థానాల్లో విజయం సాధిస్తాయి. ఇప్పటి వరకు నిర్వహించిన పది సర్వేల్లో తొమ్మిది టీడీపీ-జనసేన వైపే ఉన్నాయి. జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. బీజేపీతో పొత్తు ఓ కొలిక్కి వచ్చిన తర్వాతే సీట్ల ప్రకటన ఉంటుంది. ప్రస్తుతం వస్తున్నవన్నీ ఊహాగానాలు మాత్రమే. ఒకటి, రెండు స్థానాలు మినహా అధికారికంగా ఎక్కడా అభ్యర్థులను ప్రకటించలేదు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటన తర్వాతే సీట్ల సర్దుబాటు ఓ కొలిక్కి రావచ్చు' అని శాసనమండలి మాజీ చైర్మన్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎంఏ షరీఫ్ చెప్పారు. జిల్లా నరసాపురం టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పొత్తులో నరసాపురం టిక్కెట్ ఎవరి దక్కినా అంతా గెలుపు కోసం పని చేయాలని నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తలతో సమావేశంలో పిలుపునిచ్చారు. నియో జకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో విచారణ

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 12 : కామయ్యపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఐవో నాగేశ్వరావు, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో కేథరిన్ సిబ్బందిని విచారణ చేశారు. 2021 ఆగస్టు 8న పీహెచ్‌సీలో పనిచేసే సూపర్‌వైజర్ మహిళా ఉద్యోగిపై దాడి చేశారని, పరుష పద జాలంతో తిట్టినట్టు అప్పట్లో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై సోమవారం వైద్య ఆరోగ్యశాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నలుగురు సిబ్బందిని అధికారులు విచారణ చేసి వ్యక్తిగత వాగ్మూలం తీసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

ప్రాక్టికల్స్‌కు 246 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 : జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం 6,934 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 6,688 మంది హాజరయ్యారని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి ప్రాక్టికల్స్ జరుగుతున్న తీరుని తనిఖీ చేశారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదు.

ఆధునికీకరణ అంటే ఏమిటి ?



వెంకయ్య వయ్యేరులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

ఐదేళ్లుగా ఆ ఊసే ఎత్తని ప్రభుత్వం

- ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలు చేశారు..
- వేసవి పనులకు నిధుల విడుదల అంతంతమాత్రం
- రబీకి రూ.2 కోట్లతో సరిపెట్టిన వైనం
- నీటి కొరత తప్పదు.. రైతుల ఆందోళన

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమ డెల్టా ఆధునికీకరణ ఊసే లేకుండా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గడిపేస్తోంది. ఆధునికీకరణ పనుల కోసం పైసా మంజూరు చేయలేదు. తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు సక్రమంగా నిర్వహించలేని ప్రభుత్వంగా మిగిలిపోయింది. సాగు నీటి కోసం రైతులు ఇబ్బందులు పడే దుస్థితి కల్పించింది. ఇప్పటికీ వేసవి పనులకు బిల్లులు చెల్లించకుండా తాత్సారం చేస్తోంది. ఫలితంగా వేసవిలో తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు నిర్వహించలేకపోతున్నారు. కాలువలు అస్తవ్యస్తంగా మారడంతో శివారు ప్రాంతాలకు సాగు నీరు అందని ద్రాక్షే అవుతోంది.

ప్రస్తుత రబీలో నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఆచంట, గణపవరం వంటి మండలాల్లో సాగునీటికి అవస్థలు పడుతున్నారు. మున్ముందు ఇతర మండలాలకు ఈ కష్టాలు తలెత్తే ప్రమాదం ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టయితే పనులు నిర్వహించేవారు. కాలువల్లో కొద్దిపాటి నీరైనాసరే సక్రమంగా ప్రవహించేది. శివారు ప్రాంతాలకు నీరందే వెసులుబాటు కలిగేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గడిచిన ఐదేళ్లుగా నీటిపారుదల శాఖను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఇప్పటికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దాదాపు రూ.100 కోట్ల మేర బకాయిలు చెల్లించాలి. ప్రభుత్వం బకాయిలు ఊసే మరిచిపోయింది. దీంతో వేసవిలో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. పనులు సవ్యంగా సాగడం లేదు.

ప్రతిపాదనలకే పరిమితం

రాష్ట్ర ప్రభుత్వం ఆధునికీకరణ పనులు నిర్వహిస్తుందన్న ఆశతో మూడేళ్ల క్రితం పశ్చిమ డెల్టాకు సంబంధించి రూ.250 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం కొర్రీలు వేసి ప్రతిపాదనలను తిప్పి పంపింది. నిధులు కేటాయిస్తుందన్న ఆశతో ఎదురుచూసిన అధికారులకు చుక్కెదురైంది. ఆ తర్వాత ప్రభుత్వమే చొరవచూపింది. పశ్చిమ డెల్టా పరిధిలో మిగిలిన ఆధునికీకరణ పనులను పూర్తి చేస్తామంటూ వైసీపీ ప్రభుత్వం ముందుకొచ్చింది. వాస్తవానికి రూ.1,400 కోట్లతో ఆధునికీకరణ పనులను 2008లో ప్రారంభించారు. రూ.700 కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు. మరో రూ.700 కోట్ల పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఏలూరు కాలువ పూర్తిగా ఆధునికీకరణకు నోచుకోలేదు. తాజాగా ఆ మొత్తానికి ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు సాగు నీటి శాఖ పరిధిలో రూ.500 కోట్లు, డ్రైనేజీ విభాగంలో రూ.200 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం సదరు ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది. ఆధునికీకరణను అటకెక్కించింది. చివరకు ఉప్పుటేరుపై రెగ్యులేటర్‌లకు దిక్కు లేకుండా పోయింది. డెల్టా రైతాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

కేంద్ర నిధులను విస్మరించారు

నీటిపారుదల శాఖ గతంలో కేంద్రం నిధులను ఉపయోగించుకునేది. ఉపాధి హామీ నిధులను ఉపయోగించి పంట బోదెలను ప్రక్షాళన చేసేవారు. నీరు-చెట్టు నిధులతో కాలువల పూడిక పనులు చేపట్టేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి నిధుల వినియోగం తగ్గింది. కేవలం జగనన్న ఇళ్లకు మాత్రమే కాస్త ఉపాధి నిధులు ఉపయోగపడుతున్నాయి. అదే నీటిపారుదల శాఖలో మాత్రం పైసా నిధులు వినియోగించుకోలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడదల్చడం లేదు. ఫలితంగా నీటిపారుదల శాఖ కేవలం సాగు నీటి పర్యవేక్షణకే పరిమితమవుతోంది. వేసవిలో సాగు నీటి అవసరాలకు తీర్చేందుకు ప్రభుత్వం పెద్దగా నిధులు కేటాయించలేదు. కేవలం రూ.2 కోట్లు మాత్రమే మంజూరు చేశారు. ఆ మేరకే ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవసరమైతే గోదావరిలో సిద్ధాంతం వద్ద ఎత్తిపోతలను అమలుచేయాలి. ఇందుకు నిధులు వెచ్చించాలి. కాలువలు, డ్రెయిన్‌లలో మోటార్లు ఏర్పాటుచేయాలి. ఇవేమీ ప్రభుత్వానికి పట్టడం లేదు. డిసెంబరులో తుపాను ప్రభావం లేకుంటే ఇప్పటికీ సాగు నీటి కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితి తలెత్తేది. డిసెంబరులో కురిసిన వర్షాలతో రైతులు సునాయాసంగా నాట్లు వేసుకోగలిగారు. ఆ తర్వాత వంతుల వారీ విధానం అమలులోకి తెచ్చారు. ఎండలు కాస్త తక్కువగా ఉన్నాయి. వేసవి ముదిరితే సాగు నీటికి ఇబ్బందులు తప్పవు. ఈ అవసరాలు తీర్చాలంటే ఎత్తిపోతలు చేపట్టాలి. ఇందుకు ముందుగానే కాంట్రాక్టర్లను పిలవాలి. లేదా రైతులే ఏర్పాటు చేసుకునే విధంగా నిధులు కేటాయించాలి. ప్రభుత్వం మాత్రం నిధులు కేటాయింపుపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. దీంతో రబీపైనా ఆందోళన నెలకొంటోంది.

ఇదేనా రైతు సంక్షేమం

వెంకయ్య వయ్యేరులో నీటి ప్రవాహానికి అడ్డంకులు

చిట్టడివిలా పేరుకుపోయిన గుర్రపు డెక్క..తొలగించాలని రైతుల డిమాండ్

తొలగింపునకు అధికారుల ప్రతిపాదనలు.. స్పందించని జగన్ సర్కార్

గణపవరం, ఫిబ్రవరి 12 : రైతు సంక్షేమమే ధ్యేయమని జగన్ సర్కార్ చెబుతున్నప్పటికి ఆచరణలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. సాగు నీటి రంగంలో నిర్లక్ష్య ధోరణి కారణంగా వెంకయ్య వయ్యేరు దుస్థితి రైతుల కంట తడిపెడుతున్నాయి. 40 గ్రామాల ప్రజలకు సాగు, తాగు నీరు అందించే వెంకయ్య వయ్యేరులో గుర్రపు డెక్క పేరుకుపోయి చిట్టడివిలా తయారైంది. తాగు నీరు, ఆక్వా, వరి సాగుకు ప్రధానంగా ఈ కాల్వ నీరే ఆధారం. గణపవరంలోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుటే వెంకయ్య వయ్యేరులో ఈ గుర్రపు డెక్క మేట వేసుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరిస్తోందని, గుర్రపు డెక్క తొలగింపుపై దృష్టి సారించలేదని రైతులు, ప్రజలు మండిపడుతున్నారు. గుర్రపుడెక్క, తూడును తొలగించి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేయాలని రైతులు, ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా క్షేత్రస్థాయి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రబీ ముందే గోదావరి జలాల కొరతతో ముందస్తు నాట్లు వేసుకోవాలని మైక్‌లతో హోరెత్తించిన ప్రభుత్వ అధికారులు ఈ కాల్వ మరమ్మతులు, గుర్రపు డెక్కలు తొలగించే ప్రయత్నం చేయకపోవడంతో సాగు, తాగు నీటి ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. అలాగే విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి పెడుతున్న ఆక్వా రంగానికి సాగు నీటి సరఫరాకు గుర్రపు డెక్కే ప్రధాన ఆటంకమని చెబుతున్నారు. ఇప్పటికే వంతుల వారీగా అధికారులు నీరందిస్తున్నారు. దీంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. యుద్ధ ప్రతిపాదికన గుర్రపు డెక్కను తొలగించి సాగు నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని వయ్యేరు పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు కోరుతున్నారు. దీనిపై గణపవరం ఇరిగేషన్ సెక్షన్ ఏఈ ఫణిశంకర్‌ను వివరణ కోరగా గుర్రపు డెక్క తొలగింపుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే తొలగింపు పనులు చేపడతామని చెబుతున్నారు.

కొప్పాకలో భయం..భయం

టీడీపీ నాయకులపై వైసీపీ శ్రేణుల దాడి

- వారు మాపైనా దాడి చేశారంటూ ఎదురుకేసు
- గాయపడిన వారంతా ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స.. టీడీపీ వారికి ఎందుకు చికిత్స చేస్తున్నారని సిబ్బందిపై ఎమ్మెల్యే అబ్బయ్య మండిపాటు
- తమ పార్టీ వారినే చేర్చుకోవాలని హుకుం జారీ
- ఓటమి భయంతోనే వైసీపీ దాడులు : చింతమనేని
- ఎన్నికల ముంగిట రాజకీయ వేడి.. పోలీసు పికెట్ ఏర్పాటు

ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ గ్రామాల్లో అధికార వైసీపీ నేతలు దాడుల సంస్కృతికి తెరతీశారు. ఏదో చిన్నసాకుతో టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతున్నారు. పెదవేగి మండలం కొప్పాకలో ఆదివారం రాత్రి వైసీపీ శ్రేణులు టీడీపీ నాయకుల ఇళ్ళపై పడి విధ్వంసం సృష్టించారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కాటేపల్లి సాంబశివరావుతోపాటు మరో ముగ్గురు ఏలూరు సర్వజన ఆస్పత్రిలో చేరారు. మరోవైపు వైసీపీ నాయకులు శబరీనాథ్, రంగారావు తమపై టీడీపీ నాయకులు దాడి చేశారంటూ అదే ఆస్పత్రిలో చేరారు. ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్టు పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు.

పెదవేగి/ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 : దెందులూరు నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని రీతిలో అధికార వైసీపీ నాయకులు ప్రతిపక్ష నాయకులపై దాడుల విష సంస్కృతికి తెరతీశారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని కొప్పాకలో ఆదివారం రాత్రి వైసీపీకి చెందిన కొంతమంది నేతలు టీడీపీ నేతల ఇంటిపైకి దాడికి దిగారు. సంక్రాంతి కోడిపందేల విషయంలో ఏర్పడిన వివాదం ఒక కారణమైతే శనివారం రాత్రి జానంపేట దగ్గర పోలవరం కుడి కాల్వ గట్టు మట్టిని అక్రమంగా తరలిస్తున్న సమాచారంతో ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్కే. ఖాజావలి దాడి చేసి, మట్టిని తరలిస్తున్న టిప్పర్లను స్వాధీనం చేసుకుని, పెదవేగి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ దాడి వెనుక కొప్పాకకు చెందిన టీడీపీ నాయకులు కాటేపల్లి సాంబశివరావు, సత్య వర్ధన్‌లు ఉన్నారని భావించిన వైసీపీ నాయకులు రంగారావు, పోతురాజు, వెంకన్న తదితరులు తమ అనుచరగణంతో సాంబశివరావు, సత్యవర్ధన్ల ఇళ్లపై దాడికి తెగబడ్డారు. అడ్డుపడిన సాంబశివరావు కుటుంబీకులపై కూడా దాడికి తెగబడ్డారు. పోలీసుల రాకతో వివాదం సద్దుమణిగిన గ్రామంలో నివురుగప్పిన నిప్పులా రాసుకుంటూనే ఉంది. ముందస్తు చర్యగా పోలీసులు గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఏ క్షణంలో ఎటు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. మేము అధికారంలో ఉన్నాం. మేము ఏం చెప్పినా.. ఏం చేసినా చెల్లు బాటవుతుంది. ప్రతిపక్షంలో ఉన్న మీరు, మేము చేసే పనులను చూస్తూ ఉండాల్సిందే తప్ప మమ్మల్ని ప్రశ్నించే హక్కు మీకు లేదు. ప్రశ్నిస్తే ఫలితం ఇలాగే ఉంటుంది.. అంటూ వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారని బాధిత టీడీపీ వర్గీయులు పేర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎన్నికల వేళ రానున్న రోజుల్లో మరిన్ని దాడులు జరిగే ప్రమాదం లేకపోలేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో అధికార వైసీపీ నేతలు చేస్తున్న మట్టి గ్రావెల్ అక్రమాలను ప్రతిపక్ష టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో మట్టి మాఫియా అధికార పార్టీ నేతల సహకారంతో దాడులకు దిగుతున్నారు. గత నెల 30వ తేదీ పెదవేగి మండలం లక్ష్మీపురం పరిధిలో పోలవరం కుడి కాల్వ గట్టు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న సమాచారంతో దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మట్టి తరలిస్తున్న టిప్పర్లను పట్టుకుని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఇంతలో అక్కడికి చేరుకున్న వైసీపీ శ్రేణులు, పోలీసుల సమక్షంలోనే టీడీపీ నాయకులపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. ఈ దాడిలో ఇద్దరు టీడీపీ నాయకులకు తీవ్ర గాయాలయ్యాయి. వైసీపీ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించినందుకే ఇలా దాడులు చేస్తున్నారా.. అంటూ ప్రజానీకం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కాగా కొప్పాకలో ఆదివారం రాత్రి వైసీపీ మూకల దాడిలో గాయపడిన టీడీపీకి చెందిన కాటేపల్లి సాంబశివరావుతోపాటు మరో ముగ్గురు ఏలూరు సర్వజన ఆస్పత్రిలో చేరారు. మరో వైపు వైసీపీ నాయకులు శబరీనాథ్, రంగారావు అనే ఇద్దరు తమపై టీడీపీ నాయకులు దాడి చేశారంటూ అదే ఆస్పత్రిలో చేరారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి తన వర్గీయులను పరామర్శించడానికి ఆస్పత్రికి వెళ్లి అక్కడి అధికారులపై ఆగ్రహంతో చిందులు వేశారు. తమ వాళ్లను మాత్రమే ఆస్పత్రిలో చేర్చుకోవాలని, తమ వారిపై దాడులు చేసి ఆస్పత్రికి వస్తే ఎందుకు చేర్చుకున్నారంటూ వైద్యులను ప్రశ్నించారు. మరోవైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు శివరామ్‌ప్రసాద్‌ను పరామర్శించడానికి ఆస్పత్రికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతుండగా అదే సమయంలో ఆస్పత్రికి వచ్చిన వైసీపీ నాయకుడు, జడ్పీ చైర్మన్ భర్త ఘంటా ప్రసాద్ 'ఇదేమైనా తెలుగుదేశం పార్టీ కార్యాలయమా' అంటూ అధికారులపై, ఆసుపత్రి సిబ్బందిపై చిందులు తొక్కారు. పరుష పదజాలంతో దుర్భా షలాడడంతో తెలుగుదేశం కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసుల సహకారంతో ఆస్పత్రి గేట్లు మూయించి లోపల ఉండి మరీ బూతుల పురాణం అందుకున్నారు. గేటు వద్ద ఒకవైపు ఏలూరు త్రీ టౌన్ సీఐ వెంకటేశ్వరరావు, మరోవైపు డిస్ట్రిక్ట్ గార్డు పోలీసులు కాపలాగా ఉన్నారు. వారి సమక్షంలో అసభ్య పదజాలంతో ప్రసాద్ ఒకవైపు ఆస్పత్రి సిబ్బందితో పాటు టీడీపీ కార్యకర్తలపై, నాయకులపై విరు చుకుపడ్డారు. చివరకు అక్కడే హెల్ప్ డెస్క్‌లో ఉన్న ఆస్పత్రి ఉద్యోగి (అంధుడు) 'ఇది ఆస్పత్రి. రోగులు ఉంటారు. జాగ్రత్తగా మాట్లాడండి' అంటూ గట్టిగా చెప్పడం గమనార్హం. చివరకు పోలీసులు ఆందోళనకు దిగిన తెలుగు దేశం కార్యకర్తలను, నాయకులు సమన్వయం పాటించాలంటూ అక్కడ నుంచి పంపించివేశారు. వాస్తవానికి ఆస్పత్రిలో వైద్యం పొందడానికి ఎవరికైనా హక్కు ఉంది. ఎలాంటి బేధాలు లేకుండా ఎలాంటి వారైనా ప్రాణాపాయస్థితిలో ఉన్నారంటే ప్రాణాలు కాపాడడానికి వైద్యులు అహర్నిశలు కష్టపడుతుంటారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాత్రం కొత్త రూల్ తెవ్వడం గమనార్హం. మరోవైపు వైద్యులు సమన్వయంతో వైద్య సేవలందించడం తమ బాధ్యతని సమాధానమిచ్చారు.



వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు

- విధ్వంసకాండ



టీడీపీ నాయకుడు సాంబశివరావు ఇంటిపై వైసీపీ నాయకులు దాడి చేసి సృష్టించిన విధ్వంసం.. ఈ దృశ్యాలను సెల్‌లో చిత్రీకరిస్తున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్



బాధితుడు సాంబశివరావును పరామర్శిస్తున్న చింతమనేని

ఓటమి భయంతోనే అల్లర్లు : చింతమనేని

వైసీపీ కార్యకర్తల దాడిలో గాయాలకు గురైన సాంబశివరావు, ఆయన అన్న కోడలు ఐశ్వర్యలను చింతమనేని తన అనుచరగణంతో ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. ఈ సందర్భంగా చింతమనేని మీడియాతో మాట్లాడుతూ.. 'దెందులూరులో అరాచకపు పాలన, దుర్మార్గపు పాలన కొనసాగుతోంది. ఓటమి అంచున వున్న వారు భయంతో ఏవో అల్లర్లు సృష్టించాలని, టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. ఇసుక, మట్టిని మింగేస్తున్నారు. ప్రశ్నించిన వారిపై పగపట్టి కేసులు పెడుతూ దాడులు చేస్తున్నారు. ఈ పరిస్థితులన్ని నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారు. వారిని ఇంటికి పంపించడానికి ఓటర్లు అంతా సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి దాడులను ఖండిస్తున్నాం' అని పేర్కొన్నారు.





ఏలూరులో ర్యాలీ.. ముదినేపల్లిలో జీవో కాపీ దహనం

మరీ ఇంత తక్కువా..?

పాఠశాల విద్యకు 228, సంక్షేమ పాఠశాలలకు 78 పోస్టులతోనే డీఎస్సీ సరి!

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12:డీఎస్సీ-2024 ఉపాధ్యాయ నియామకాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ యాజమాన్యాల పాఠశాలల వారీగా భర్తీ కానున్న పోస్టుల సంఖ్య ఖరారైంది. సోమవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పోస్టులపై పూర్తి స్పష్టత వచ్చింది. మొత్తం 306 ఉపాధ్యాయ ఖాళీలను డీఎస్సీలో భర్తీ చేయనుండగా, వీటిలో స్కూల్ అసిస్టెంట్/టీజీటీ కేడర్ పోస్టులు 204, ఎస్జీటీ కేడర్ 102 పోస్టులను నోటిఫై చేశారు. పాఠశాల విద్యా శాఖ పరిధిలోని మునిసిపల్, గవర్నమెంట్, జడ్పీ యాజమాన్యాల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టులు 164, ఎస్జీటీ 88 భర్తీ అవుతాయి. వీటిలో స్కూల్ అసిస్టెంట్ ప్రథమ భాష 19 (గవర్నమెంట్/జడ్పీలో 13-మునిసిపాలిటీల్లో 6) ఖాళీలు, ద్వితీయ భాష 31 (30-1), ఇంగ్లీషు 26 (21-5), గణితం 18 (12-6), ఫిజికల్ సైన్స్ 6 (6-0), బయోలాజికల్ సైన్స్ 7(7-0), సోషల్ స్టడీస్ 1(0-1), వ్యాయామ విద్య 32 (26-6) ఖాళీలను భర్తీ చేయడానికి నిర్దేశించారు. ఇవిగాక ఎస్జీటీ కేడర్‌లో కేటాయించిన 88 పోస్టుల్లో 68 ఖాళీలు జడ్పీ, గవర్నమెంట్ యాజమాన్యాలకు, మిగతా 20 ఖాళీలను మున్సిపల్ యాజమాన్య పాఠశాలలకు ప్రత్యేకించారు. ఆ ప్రకారం పాఠశాల విద్యాశాఖ పరిధిలో నోటిఫై చేసిన మొత్తం 228 పోస్టుల్లో ప్లెయిన్ గవర్నమెంట్ / జడ్పీ/ఎంపీపీ యాజమాన్యాలకు 183, మునిసిపాలిటీలకు 45 పోస్టులు నిర్దేశించినట్టయింది.

మిగతా యాజమాన్యాల్లో 78 పోస్టులు

బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో 6, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 31, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 13, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీలో 9 పోస్టులు కలిపి మొత్తం 59 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలను డీఎస్సీలోనే చేపడుతున్నారు. వీటితోపాటే స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో గిరిజన పాఠశాలల్లో 4, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో 1 పోస్టు, ఎస్జీటీ కేడర్‌లో గిరిజన పాఠశాలల్లో 14 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో ఏపీ మోడల్ స్కూల్స్ లేనందున పీజీటీ, ప్రిన్సిపాల్ పోస్టుల భర్తీ ఉండదు. యాజమాన్యాల వారీగా రోస్టర్ ప్రకారం నియామకాలు ఉంటాయి.

22 వరకు దరఖాస్తుల స్వీకరణ

డీఎస్సీకి నిర్ణీత ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 22 వరకు ఉంది. మార్చి 5 నుంచి హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్, 15 నుంచి 30వరకు రోజుకు రెండు సెషన్లలో కంప్యూటర్ బేస్డ్ టెస్టు(సీబీటీ) ఉంటాయి. మార్చి 31న ప్రాథమిక కీ, ఏప్రిల్ 1న అభ్యంతరాల స్వీకరణ, 7న ఫలితాలు విడుదల జరుగుతాయి. పూర్తిస్థాయి నోటిఫికేషన్‌ను సీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చు. ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకు ఏర్పడిన ఉపాధ్యాయ ఖాళీలను డీఎస్సీ నోటిఫికేషన్‌లో చేర్చినట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

మెగా డీఎస్సీ కావాలంటూ ఆందోళన

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 : మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ దగా డీఎస్సీ కాదు, మెగా డీఎస్సీ కావాలని తక్షణం మెగా డీఎస్సీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోస్టుల సంఖ్య పెంచి నోటిఫికేషన్ సమయం పెంచాలని కోరారు. ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలు పరిష్కారం చేయకుంటే డీఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ తక్షణమే కొత్త నోటిఫికేషన్‌తో డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని, ఖాళీగా ఉన్న 25 వేలు పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీ అప్రెంటీస్ జీవో ప్రతులు దహనం

ముదినేపల్లి : డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు రెండేళ్లపాటు అప్రెంటీస్ చేయాలని ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను నిరసిస్తూ ఆ జీవో ప్రతులను సోమవారం యూటీఎఫ్ యూనియన్ మండల శాఖ అధ్యక్షురాలు ఎం.సాయిలక్ష్మి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద దహనం చేశారు. ఎంవి.బేతాళరావు, పులి శ్రీనివాసరావు, సింహాచలం, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు దగ్గర పడుతుంటే టీచర్లకు శిక్షణలా ?!

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 : త్వరలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా హైస్కూల్స్ హెచ్ఎంలు, సబ్జెక్టు టీచర్లకు ఈ నెల 13 నుంచి మార్చి నెల మొదటి వారం వరకు రెండువిడతల్లో చేపట్టనున్న టీచర్స్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని వాయిదా వేయాలని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అలా వీలుకాని పక్షంలో కనీసం శిక్షణా కేంద్రాలను డివిజన్ కేంద్రాల పరిధిలోకి మార్చాలని అభ్యర్థిస్తూ రాష్ట్రవిద్య, పరిశోధన, శిక్షణమండలి (ఎస్సీఈఆర్టీ) డైరెక్టర్ ప్రతాపరెడ్డికి విజ్ఞప్తి చేస్తూ సోమవారం లేఖ రాశామన్నారు.

రేపు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్-మనక్ సైన్స్ ఎగ్జిబిషన్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 : ఇన్‌స్పైర్-మనక్ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (2022-23)కి ఎంపికైన ప్రాజెక్టులతో సంబంధిత విద్యార్థులు ఈ నెల 14న ఉదయం 8 గంటలకు దెందులూరు మండలం, కొవ్వలి జడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్‌కు తమ గైడ్‌టీచర్‌తో సహా హాజరు కావాలని డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తాము తయారు చేసిన ప్రాజెక్టు రైటప్, పాస్‌పోర్టు సైజు ఫోటోలు, బయోడేటా, వారెంట్‌తో సహా హాజరు కావాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ చౌదరిని ఫోన్ నంబరు 94407 12412లో సంప్రదించాలని కోరారు.

నేడు జిల్లా పరిషత్ సమావేశం

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 12: ఏలూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జడ్పీ సమావేశం జరగనున్నది. ప్రస్తుత ప్రభుత్వానికి సంబంధించి ఈ ఏడాది ఇదే చివరి సమావేశం. జడ్పీ పరిధిలో 48 మండలాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇది ఎన్నికల ఏడాది కావడంతో పనుల వేగం కూడా పెంచారు. ఇప్పటివరకు జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలు సాదాసీదాగా జరిగేవి. 48 మంది జడ్పీటీసీ సభ్యులలో 46 మంది అధికార పార్టీ వారే కావడంతో వాడీ వేడి చర్చలకు అవకాశాలు లేవు. అధికార పార్టీ సభ్యులే పలు ప్రశ్నలను లేవనెత్తేవారు.ఈ ప్రభుత్వ హయాంలో ఇదే చివరి సమావేశం కావడం ఇప్పటి వరకు చేపట్టిన పనులపై పూర్తిస్థాయిలో చర్చ జరిగే అవకాశాలున్నాయి. సమావేశంలో ప్రధానంగా 2023-24 సంవత్సరానికి బడ్జెట్ సవరణ అంచనాలు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలపై చర్చ, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష ఉంటుందని జడ్పీ సీఈవో సుబ్బారావు తెలిపారు.

ఎస్టీయూ పశ్చిమ నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) పశ్చిమ గోదావరి అధ్యక్ష కార్యదర్శులుగా గుత్తుల శ్రీనివాస్, పెన్మెత్స సాయివర్మలు ఎంపికైనట్లు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సాయిశ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీయూ పశ్చిమ గోదావరి జిల్లా 77వ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ఈ ఎన్నిక జరిగిందన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అందాల్సిన బకాయిలు, పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ రుణాలు, సరెండర్ లీవులు, మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులు, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ సకాలంలో చెల్లించేలా ప్రభుత్వంపై పోరాటాల ద్వారా ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. జీవో నెంబరు 117 రద్దు, సీపీఎస్ రద్దు కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు.



డీఎస్సీ 2024 జీవో కాపీలను దహనం చేస్తున్న యుటీఎఫ్ నాయకులు


అప్రెంటిస్ విధానం దుర్మార్గం : యూటీఎఫ్

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 12: ఉపాధ్యాయ నియామకాల్లో బానిస వ్యవస్థ అయిన అప్రెంటిస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపిమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ-2024 నియామకాల్లో అప్రెంటిస్ విధానం రద్దు చేయాలని యుటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో బాగంగా భీమవరంలో నిరసన తెలిపారు. డీఎస్సీ 2024 జీవో కాపీలను దహనం చేశారు. ఉపాధ్యాయ నియామకాలు రెగ్యులర్ ప్రాతిపదికన కాకుండా 18 సంవత్సరాలు పోరాడి రద్దు చేసుకున్న అప్రెంటీస్ విధానం తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గపు చర్య అన్నారు. యూటీఎప్ నాయకులు పీఎస్వీ విజయరామ రాజు, పట్టాబి రామయ్య, సాయిరాం, రామకృష్ణ రాజు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

అందరినీ కలుపుకుని ముందుకు సాగాలి : జోగయ్య

పాలకొల్లు, ఫిబ్రవరి, 12 : వచ్చే ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం కానున్నాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు అందరినీ కాపు వర్గాలు కలుపుకొని విజయమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య సోమవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ జనాకర్షన గల నాయకుడని, నీతివంతమైన పరిపాలనే ధ్యేయంగా పొత్తులో ముందుకెళుతున్నారని అన్నారు. ఈ యజ్ఞంలో భాగంగా విజ్ఞానవంతులు చందు జనార్ధన్ ఆధ్వర్యంలో నడుస్తున్నటివంటి కాపు జాగృతి, కాపు జేఏసీ లాంటి సంస్థలు కూడా కాపు సంక్షేమ సేనతో భాగస్వాములవ్వాలని కోరారు.

వెల్లుల్లి ఘాటు..
ఉల్లి ఊరట



అందుబాటులో ఉల్లి ధరలు.. కిలో రూ.10 నుంచి 20

మంట పుట్టిస్తున్న వెల్లుల్లి..కిలో రూ.360

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 12: సామాన్యులకు ఉల్లి ధరలు ఊరట నిస్తుంటే వెల్లుల్లి ధరలు మాత్రం చుక్కలు చూపిస్తున్నాయి. కొంతకాలంగా రూ.20 నుంచి 30 వరకూ విక్రయించిన ఉల్లి ధరలు తగ్గుముఖం పడుతుంటే వెల్లుల్లి ధరలు మాత్రం రూ.300 నుంచి రూ.360 వరకూ పలుకుతున్నాయి. వెల్లుల్లి ఎక్కువగా మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి అవుతుంది. అక్కడ చీడ ప్రభావంతో దిగుబడి ఆశాజనకంగా లేకపోవడంతో ధరలు కొండెక్కాయి. మొన్నటి వరకూ రూ.200లకు విక్రయించిన వెల్లుల్లి ఒక్కసారిగా రూ.360 పైనే విక్రయిస్తున్నారు. దీంతో సామాన్యులు వెల్లుల్లి మాట ఎత్తాలంటేనే భయపడే పరిస్థితి కనిపిస్తోంది. రాబోయే వేసవిలో పచ్చడి పట్టేందుకు ఎక్కువగా ఉపయోగించే వెల్లుల్లి ధర పెరగడంతో పచ్చడి ప్రియులకు ఆందోళన కలిగిస్తోంది. " వెల్లుల్లి ఉత్పత్తి ఈ ఏడాది బాగా తగ్గింది. గత అక్టోబరు నుంచి డిసెంబరు వరకు బంగ్లాదేశ్‌తో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లో వరదలకు పంటలు దెబ్బతిన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పంట లేకపోవడం, దిగు మతులు తగ్గడంతో వెల్లుల్లికి డిమాండ్ పెరిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే మరింత ధర పైకి ఎగబాకే అవకాశం ఉందని" స్థానిక వ్యాపారులు చెబు తున్నారు. ఉల్లి పంట దిగుబడి ఆశాజనకంగా లేక పోవడంతో ఉల్లి ధరలు నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎగుమతులు నిలుపుదల చేసింది. దీంతో మహారాష్ట్ర నుంచి ఉల్లి వస్తుండటంతో ధరలు అందు బాటులోకి వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి కేజీ ఏగ్రేడ్ రూ.20 విక్రయి స్తుండగా తరువాత క్వాలిటీ ని బట్టి ఉల్లి రూ.10 నుంచి 15 వరకూ అమ్ముతున్నారు.

ఏం కొనాలి ?



ఎక్కువగా కూలి పనులకు వెళ్లే మాలాంటి కుటుంబాలకు పచ్చడే ఆధారం.. అలాంటి పచ్చడి చేసుకోవాలంటే ముఖ్యంగా కావాల్సింది వెల్లుల్లి. అలాంటి వెల్లుల్లి రూ.360లకు చేరడంతో ఏం కొనగలం.. ధరలు నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి.

-ఎస్.రామకృష్ణ, తాడేపల్లిగూడెం

సామాన్యులకు ఇబ్బందే



ఉల్లి ధరలు అందుబాటులోకి రావడం మంచి పరిణామమే. పచ్చళ్ల సీజన్ సమయంలో వెల్లుల్లి ధరలు చుక్కలనంటడం దారుణం. ఈ ధరల పెరుగుదల సామాన్యులకు, పచ్చళ్ల ప్రియులకు ఇబ్బందికరమే.

-ఏ.బాలాజి, వ్యాపారి

హోర్డింగ్ పెట్టు..సొమ్ములు పట్టు

ఇబ్బడి ముబ్బడిగా ప్రకటనల బోర్డులు
కార్పొరేషన్ ఆదాయానికి గండి
సిబ్బంది పై అవినీతి ఆరోపణలు



ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 12 : ఏలూరు నగరంలో ప్రధాన కూడళ్లు, రోడ్ల వెంబడి, వంతెనలు, ఫ్లయ్ ఓవర్లు, బ్రిడ్జిలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు.. ఇలా అక్కడా.. ఇక్కడా అని లేదు.ఏ చిన్నస్థలం దొరికినా అక్కడ ప్రకటనల బోర్డులు వెలుస్తున్నాయి. వాణిజ్య, వ్యాపార ప్రకటనలు రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, వ్యక్తిగతమైన ప్రకటనల బోర్డులు నగరాన్ని ముంచెత్తుతున్నాయి. ఈ బోర్డులు చూసిన వారు నగరపాలక సంస్థకు కోట్ల రూపాయాల్లో ఆదాయం వస్తుందని అనుకుంటారు. కానీ వాస్తవంలో అలా జరగడం లేదు. ప్రకటన దారులు ఎక్కడైన బోర్డులు ఏర్పాటు చేయాలంటే పట్టణ ప్రణాళిక విభాగం అనుమతి తప్పనిసరి. ప్రకటనదారులంతా అధికారుల అనుమతి తీసుకుం టున్నారా... అంటే లేదనే చెప్పవచ్చు. ఎందుకంటే అనుమతి తీసుకోవాలని అవగాహన కల్పించాల్సిన పట్టణ ప్రణాళిక విభాగంలో కొంతమంది సిబ్బంది కాసులకు కక్కుర్తిపడి అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ప్రభుత్వానికి చెందాల్సిన ఆదాయాన్ని ముడుపుల రూపంలో మింగేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో వ్యాపార సంస్థలు, సినిమా హాళ్ళు, కళాశాలలు, పాఠశాలలు, రెస్టారెంట్లు, సినిమా థియేటర్స్‌లో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు వ్యాపార ప్రకటనలు భారీగా దర్శనమిస్తున్నాయి. నగరంలో వ్యాపార ప్రకటనల బోర్డుల వల్ల కేవలం 35 లక్షల రూపాయలు మాత్రమే కార్పొరేషన్‌కు చేరుతుంది. అనధికారికంగా అధికారుల పర్మిషన్ లేకుండా ఏర్పాటు చేసుకునే ప్రకటన బోర్డుల ఆదాయమంతా సిబ్బంది జేబుల్లోకి వెళ్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక పక్క కమిషనర్ ఆదాయ మార్గాలు పెంచాలని పదే పదే మీటింగులుపెట్టి చెబుతుంటే కిందిస్థాయి సిబ్బంది అందుకు విరుద్ధంగా కార్పొరేషన్ ఆదాయానికి గండి కొట్టడం విశేషం. కొంత మంది పర్మిషన్ తీసుకున్న ప్రకటన దారులు సైజులు పెంచి పర్మిషన్ తీసుకున్న దానికంటే ఎక్కువ సైజులో ఫ్లెక్సీలు పెట్టడం, పర్మిషన్ తీసుకున్న సంఖ్య కంటే అధిక సంఖ్యలో బోర్డులు పెడుతున్నారు. అలాంటి వారి నుంచి కూడా మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్న తాధికారులు స్పందించి పట్టణ ప్రణాళిక విభాగంలో జరిగే అవినీతిని అంత మొందించడంతో పాటు కార్పొ రేషన్‌కు ఆదాయ మార్గాలు పెంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకటనల రేట్లు ఇలా..

బిల్డింగుల పైన, గోడల పైన ఒక చదరపు మీటరుకు రూ.400, వాహనాలపై పెట్టుకుని తిరిగే వాటికి 5 చదరపు మీటర్ల వరకు రూ.2,500, దీపాలతో అలంకరించే వాహనాల బోర్డులకు 5 చదరపు మీటర్లకు రూ.5వేలు, సినిమా థియేటర్లో బ్లాక్ అండ్ వైట్ ప్రకటనలకు రూ.10 వేలు, చిన్న ట్రైలర్లకు రూ.2500 నుంచి ప్రారంభం.

ఆదాయం పెంచే మార్గాలు అన్వేషిస్తున్నాం

నగరంలో వ్యాపార ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచే మార్గాలు ఆలోచిస్తున్నాం. ఎక్కడైన పర్మిషన్ లేకుండా బోర్డులు పెట్టే వారిని గుర్తించి నోటీసులు పంపి జరిమానాలు విధిస్తున్నారం. సిబ్బంది అవినీతికి పాల్పడు తున్నారనే ఆరోపణల్లో నిజం లేదు. - ఏసీపీ తిరుపతిరావు

పోలవరంలో రెండు తలల పాము



పోలవరం, ఫిబ్రవరి 12 : పోలవరం బీసీ కాలనీలో సోమవారం రాత్రి అరుదైన రెండు తలల పాము హల్‌చల్ చేసింది. పోలవరం పంచాయతీ బీసీ కాలనీలో వైసీపీ నాయకురాలు పాతిమున్నీసా ఇంటి వద్ద రెండు తలల పాము కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచార మిచ్చారు. అటవీశాఖ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని పాముని పట్టుకుని అటవీ క్షేత్రాధికారి ఎస్.దావీదు రాజు ఆదేశాల మేరకు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దావీదు రాజు మాట్లాడుతూ అరుదైన సర్ప జాతికి చెందిన ఈ పాము విషరహితమైనదని ప్రమాదకారి కాదన్నారు. దీనిని రెడ్ శాండ్‌బోవా అని పిలుస్తారని దానిని సాధారణంగా రెండు తలల పాముగా పిలుస్తారని వాస్తవానికి ఒకే తల ఉండి తోక మొండిగా ఉండడం వలన రెండుతలల పాముగా భ్రమిస్తారన్నారు. అటవీశాఖ పారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.బాబూరావు, బీట్ ఆఫీసర్ రాజేష్, మధుకర్, గాంధీ పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యాలు చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 12 : పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వర జనార్ధనస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందూధర్మ ప్రచార మహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం సువాసినులకు (ముత్తయిదువులు) పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం భీమవరానికి చెందిన మయూరి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారిచే కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. దేవస్థానం ఈవో కృష్ణంరాజు, ధర్మకర్తలు కూర్మదాసు సత్య శ్రీనివాస్, నాచు శ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు చెల్లబోయిన సూర్యప్రకాష్, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రామకృష్ణ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం దగ్గర నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్లకు ఇక్కట్లు

ఆకివీడు, ఫిబ్రవరి 12:పేదల ఇళ్ళ పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ లబ్ధిదారులతో పాటు ఉద్యోగులకు చుక్కలు చూపుతుంది. సర్వర్ సమస్యతో లబ్ధిదారులు గంటల కొద్ది వేచి చూడాల్సి వస్తుంది. జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జనవరి 31న ప్రారంభించి, ప్ర భుత్వ ఆదేశాల మేర సెలవు రోజుల్లో కూడా రిజిస్ట్రేషన్లు చేస్తున్నా సర్వర్ సమస్యలతో ముందుకు సాగడంలేదు. ఉద్యోగులు రాత్రి, పగలు ఆ పనిలో నిమగ్నమవుతున్నా సాంకేతిక సమస్యలతో సమయం వృధా కావడంతో పాటు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సమయంలో సర్వర్ పనిచేయకపోవడంతో మహిళలు నిరీక్షించారు.



జెండాలు కట్టారని చెట్టు నరికేస్తారట..!

పెనుమంట్ర, ఫిబ్రవరి 12 : పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లిందల పర్రులో వైసీసీ అరాచకానికి ఈ సంఘటన పరాకాష్టగా నిలుస్తుంది. చెట్టుకు టీడీపీ జెండాలు కట్టారని ఏకంగా చెట్టునే నరికేయాలని ప్రయత్నించారు స్థానిక వైసీపీ నాయకులు కొందరు.. ఇటీవల ప్రజల వద్దకు పితాని ఎన్నికల పాదయాత్రలో భాగంగా సోమరాజు ఇల్లిందలపర్రులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో పాటు చెట్లకు తెలుగుదేశం తోరణాలను కట్టారు. వైసీపీ నేతలు రోడ్డు నిర్మాణం శంకుస్థాపనకు చెట్లు అడ్డు వస్తున్నాయని చెట్లు తొలగించేందుకు ప్రయత్నించారు దీంతో స్థానికులు అడ్డుకోవడంతో చెట్లు తొలగింపు ఆగింది. వేసవికాలం ప్రయాణికులు ఈ చెట్ల కింద సేద తీరుతుంటారు. అటువంటి నీడనిచ్చే చెట్లను తెలుగుదేశం తోరణాలు కట్టారని అక్కస్సుతో తొలగించాలనే చూడటం దుర్మార్గమని వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని అన్నివర్గాల ప్రజలు నిర్ణయించినట్లు తెలిసింది. నాలుగున్నరేళ్లుగా రోడ్డు నిర్మించాలని ఆలోచన లేని అధికార పార్టీ నేతలు ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా శంకుస్థాపన రాళ్లు వేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

బైక్ పైనుంచి పడి యువకుడి మృతి

ఆచంట, ఫిబ్రవరి 12: ఆచంట మండలం వల్లూరులో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో మోటారు సైకిల్ అదుపుతప్పి పితాని రామ నాగేంద్ర (25) మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. యలమంచిలి మండలం కంచుస్తంభంపాలెంకు చెందిన నాగేంద్ర వల్లూరు శివారు వాకలగరువులో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. నాగేంద్ర ఎప్పటిలాగే షాపు కట్టేసి ఇంటికి మోటారు సైకిల్‌పై వెళుతుండగా వల్లూరు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద మట్టి గుట్టను ఎక్కించడంతో మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ తెలిపారు.



లారీని ఢీకొట్టిన వ్యాన్.. క్లీనర్ మృతి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 12: ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న ఘటనలో మినీ వ్యాన్ క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన సలికే రాజకుమార్ (25), సలికే రవితేజతో కలసి పాయకరావుపేట నుంచి వరంగల్‌కు టాటా ఏస్‌లో బయలు దేరాడు. రవితేజ వ్యాన్ నడుపుతున్నాడు. ద్వారకాతిరుమల మండలం లక్ష్మీ నగర్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న టిప్పర్ లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో టాటా ఏస్ వాహనం కంట్రోల్ చేయలేక లారీని వేగంగా ఢీకొట్టింది. దీంతో రాజకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. రవితేజకు గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు లారీ డ్రైవర్ గొటుకుల సోమరాజు, రవితేజలపై మృతుని తండ్రి నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెరువులో పడి రైతు మృతి



పరిశీలిస్తున్న త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 : రాత్రివేళ మోటారు వేసే నిమిత్తం పొలం వెళ్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి ఒక రైతు మృతి చెందాడు. పెదవేగి మండలం అమ్మ పాలెం గ్రామానికి చెందిన పిల్లి గోపాలం (52) అమ్మపాలెం పరిధిలోని బైపాస్ దగ్గరలో రెండు ఎకరాల వ్యవసాయం చేస్తు న్నాడు. రాత్రి వేళ మోటారు వేయడానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఏలూరు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందడంతో సీఐ వెంకటేశ్వరావు, హెడ్ కానిస్టేబుల్ యేసేబు తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

క్రైం కార్నర్

కౌలు రైతు ఆత్మహత్య

పెదపాడు, ఫిబ్రవరి 12 : పెదపాడు మండలం నాయుడుగూడెం గ్రామం మంగలిపేటకు చెందిన కౌలురైతు పురుగుమందు తాగి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన సత్యవోలు సుబ్రహ్మణ్యం (39)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొన్నేళ్లుగా కౌలుకు వ్యవసాయం తీసుకుని సాగు చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటి వద్ద అపస్మారక స్థితిలో వున్న సుబ్రహ్మణ్యంను బంధువులు చికిత్స నిమిత్తం తొలుత పెదపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి, మెరుగైన చికిత్సకై ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులతో మానసిక ఒత్తిడికి గురై పురుగుమందు తాగినట్లుగా తల్లి వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు.

నిప్పు అంటుకుని ఒకరికి గాయాలు

పాలకోడేరు, ఫిబ్రవరి 12 : మద్యానికి బానిసై సిగరెట్ కాలుస్తూ ఆద మరుపుగా ఉన్న వ్యక్తికి సిగరెట్ ద్వారా నిప్పు అంటుకుని గిరిజాల రాంబా బుకు గాయాలైనట్లు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. ఆసుపత్రి నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విస్సాకోడేరు గ్రామానికి చెందిన రాంబాబు భార్యతో గొడవల కారణంగా ఒక్కడే ఉంటున్నాడు. ఆదివారం మద్యం మత్తులో సిగరెట్ ద్వారా నిప్పు అంటుకుని చేతులకు, కాళ్ళకు గాయాలయ్యాయని, దీంతో స్థానికులు మంటలు ఆర్పివేసి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

బెల్లపు ఊట ధ్వంసం..25 లీటర్ల సారా స్వాధీనం

పోలవరం, ఫిబ్రవరి 12 : సారా బట్టీలపై దాడులు నిర్వహించి నాలుగు వందల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేట గ్రామ శివారున కాలువల పక్కన సారా బట్టీలు నిర్వహిస్తున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. బట్టీ నిర్వాహకులు పరారీలో ఉన్నారని ఎల్ఎన్‌డీ గ్రామానికి చెందిన సంసాని రమేశ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలం తగాదా..ఒకరిపై ఒకరు ఫిర్యాదులు

ఆకివీడు, ఫిబ్రవరి 12: పొలం సరిహద్దు విషయంలో కొట్టుకుని చికిత్స పొందుతూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగబాబు తెలిపారు. కుప్పనపూడికి చెందిన జక్కా శివన్నారాయణ, జక్కా శ్రీనివాసరావులు చెరువు తవ్వుకుంటుండగా సరిహద్దు విషయంలో గొడవపడి కొట్టుకున్నారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

కొట్లాట కేసులో ఆరుగురికి రిమాండ్

ఆకివీడు, ఫిబ్రవరి 12: కోట్లాట కేసులో ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. పెదకాపవరం శివారు గొల్లగూడెంలో జనవరిలో కొట్లాట జరగడంతో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో సోమవారం ఆరుగురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

ఆకివీడులో వ్యాన్ బీభత్సం

చౌకడిపో డీలర్ల సంఘం రాష్ట్ర నాయకుడు జీవరత్నం మృతి
విరిగి పడిన కరెంటు స్తంభం.. పలు వాహనాలు ధ్వంసం



జీవరత్నం (ఫైల్)



ఆకివీడు, ఫిబ్రవరి 12: ఆకివీడులో ఐషర్ లారీ బీభత్సం సృష్టించింది. ఆ ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. దాని స్పీడ్‌కు కరెంటు స్తంభం విరిగిపడింది. పలు వాహనాలు ధ్వంస మయ్యాయి. ఆకివీడులో హెచ్‌పీ బంకు ఎదురుగా జాతీయ రహదారిపై స్కూటీపై వెళుతున్న రేషన్ డీలరు, చౌకడిపో డీలర్ల రాష్ట్ర నాయకుడు మద్దా జీవరత్నం (66)ను చేప పిల్లల ఐషర్ లారీ ఢీకొట్టడంతో మృతి చెందారు. జీవరత్నం రిజిస్ట్రేషన్ పనిమీద స్కూటీపై కూతురితో కలిసి సచివాలయానికి వెళ్లాడు. ఆమెను అక్కడ దించి ఎదురుగా ఉన్న బంకులో పెట్రోలు కొట్టించుకుని రోడ్డు దాటుతుండగా ఐషర్ లారీ వెనుక భాగం ఢీకొట్టడంతో స్కూటీతో సహా పక్కకు పడిపోయాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళగా వైద్యుడు చనిపోయారని తెలిపారు. డ్రైవర్ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీభత్సం జరిగిందిలా..

ప్రమాదం జరిగిన ఆందోళనలో వ్యాన్‌డ్రైవర్ జాతీయ రహదారికి పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. స్తంభం విరిగి ఎస్ఎల్వీ హోమ్ మార్ట్ ఎదురుగా ఆగి ఉన్న రెండు మారుతి కార్లు, రెండు మోటారు సైకిళ్లపై పడడంతో ధ్వంసమయ్యాయి. అంతేకాకుండా రోడ్డ పక్కన ఉన్న మెకానిక్ షాపును ఈడ్చుకెళ్ళిపోయింది. షాపు యజమాని ఎండ ఎక్కువగా ఉండడంతో అప్పుడే పక్కకు వెళ్ళడంతో ప్రాణాలు నిలిచాయి. అంతటితో ఆగకుండా వ్యాన్ అక్కడే ఉన్న ఆటోని ఢీకొని నాగదుర్గ దేవాలయం గోడను ఢీకొట్టి ఆగింది. విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వెంటనే యాంగిలర్ ఊడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



బైక్‌లు, కారుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ఆకివీడు, ఫిబ్రవరి 12: నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాగబాబు తెలిపారు. గుమ్ములూరు దళితపేటలో సోమవారం వెంకటరత్నం అనే వ్యక్తి మద్యం అమ్ముతుండగా 180 ఎంఎల్ మద్యం సీసాలు-4, 3 బీర్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు..నిలిచిన సరఫరా



ఆకివీడు,ఫిబ్రవరి 12: ఆకివీడు ముస్లీం వీధిలో సోమవారం ఒక యువకుడు కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. యువకుడికి స్వల్ప గాయాలవగా కారు ముందర భాగం స్వల్పంగా దెబ్బతింది. విద్యుత్ వైర్లు తెగి నేలమీద పడ్డాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు మరమ్మత్తులు చేసి సరఫరా అందించారు.

అమరవరం రేవులో మత్స్యకారుడి గల్లంతు

కుక్కునూరు, ఫిబ్రవరి 12 : కుక్కునూరు మండల పరిధిలోని అమరవరం గోదావరి రేవు ప్రాంతంలో నీటిలో పడి జాలరి గల్లంతైనట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా ఎటపాక మండలానికి చెందిన గోవిందు (55) గోదావరి ఇసుకలో గుడిసెలు వేసుకొని మరికొంతమందితో కలసి చేపలు వేట సాగిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో సోమవారం బోటులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు గోదావరిలో పడి గల్లంతైనట్లు జాలర్లు చెబుతున్నారు. ఈ సంఘటనపై సమాచారం అందలేదని కుక్కునూరు పోలీసులు చెబుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌వైర్ చోరీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 : పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను అర్ధరాత్రి దొంగలు పగులగొట్టి కాపర్‌వైరును అపహరించుకుపోయారు. విద్యుత్ ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు సమీపంలోని వట్లూరు సీతారామపురం రోడ్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని వైరును అపహరించుకుపోయారు. సోమవారం ఉదయం ఈ సంఘటనపై ఏఈ యడ్లపల్లి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే చోరీ.. నగదు, బంగారం అపహరణ

పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి, 12 : పాలకొల్లు రూరల్ మండలం శివదేవుని చిక్కాల గ్రామానికి చెందిన తండా ఇస్సాకురాజు ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి చర్చికి వెళ్లగా ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. 5 కాసుల బంగారం, రూ.20 వేలు నగదు చోరీ జరిగినట్లు సోమవారం ఉదయం గుర్తించిన కుటుంబ సభ్యులు పాలకొల్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాలకొల్లు రూరల్ సీఐ కుడిపూడి సతీష్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్న వేధింపుల కేసు నమోదు

ఉండి, ఫిబ్రవరి 12: ఉండి గోరింతోటకు చెందిన రామకూరి వెంకటరత్నంకు వరాహపట్నానికి చెందిన సంధ్యారాణిలకు 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. అదనపు కట్నం కావాలంటూ వేదిస్తున్నట్టు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.



మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

16న బంద్‌ను జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 12: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిద్దామని, ఈ నెల 16న జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రెడ్డిగణప వరం, బుట్టాయగూడెం, దొరమామిడి, నూతిరామన్నపాలెంలో ప్రాంతాల్లో ప్రజా సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం నాయకులు ఎం.నాగమణి, తెల్లం రామకృష్ణ, టి.బాబురావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చి పదేళ్లవుతున్నా సమస్యలు పరిష్కరించలేదన్నారు. నిరుద్యోగం పెరిగిపోయిందని, సమస్యలపై చేస్తున్న పోరాటాలను రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తుందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల వ్యవస్థను రద్దుచేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టాలు చేయాలన్నారు. అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని మోదీ గాలికొదిలేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

● పెదపాడు: కార్మిక, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న జరుగుతున్న గ్రామీణ భారత్ బంద్ - పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. పెదపాడులో బంద్ కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ దేశ సంపదను వారికి కట్టబెట్టడం దారుణమని పలు సంఘాల నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ, రైతు సంఘం, ఆవాజ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మందులతో మూర్ఛ వ్యాధి నివారణ



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 12: మందులతో మూర్ఛ వ్యాధి నివారించవచ్చని కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల విద్యాలయం కోఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ మూర్ఛవ్యాధి దినం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యాలయ కరస్పాండెంట్ యంగ్రీ డోమనిక్ మాట్లాడుతూ మూర్ఛ మెదడు సంబంధ వ్యాధి అని, 70శాతం మందికి మందులతో నయం చేయవచ్చన్నారు. ఫిజియోథెరపి, స్పీచ్ థెరపి, ఆడియోలజీ, తదితర సేవలందించడం జరుగుతుందన్నారు. పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో బాల మేళా ఆటల పోటీలు



గెలుచుకున్న బహుమతులతో విద్యార్థులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 12: చొదిమెళ్ల ఏరియా పాఠశాల ప్రాంగణంలో చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలమేళా పేరుతో ఆటల పోటీలు నిర్వహించారు. బాల బాలికలకు ఐదు రకాల ఫన్నీగేమ్స్, బెలూన్ గేమ్, లక్ సర్కిల్ న్యూమరికల్ గేమ్ ఆటలు ఆడించారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ మూడు కేటగిరీల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్పొరేటర్ బి.విజయ్‌కుమార్, హెచ్ఎం డి.రవికుమార్, ఎస్.రవిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాదరావు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 : రహదారిపై వాహనదారులు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఎంవీఐ కేవీఎస్.ప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వట్లూరు సీఆర్ రెడ్డి మహిళా కళాశాల లో సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీబ్రా లైన్స్ ఉన్నచోట మాత్రమే రోడ్డు దాటాలని, ఫుట్‌పాత్ లేని చోట రోడ్డుకు కుడివైపు నడవాలన్నారు. వాహనాలు నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ ఐలెండ్ (రోడ్డు మధ్యలో ఉండే కట్ట)నుంచి బయటకు అడుగుపెట్టడం చాలా ప్రమాదమని, రోడ్డు మలుపులు దగ్గర దాటేప్పుడు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్, సీటు బెల్టు ఉపయోగించడం తప్పనిసరి అన్నారు. వాహనదారులు మలుపు తిరిగేటప్పుడు సిగ్నల్స్ ఇవ్వాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, సిబ్బంది, కళాశాల బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

● పెదపాడు: రోడ్డు భద్రతపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండడం ద్వారా రోడ్డు ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చని డాక్టర్ ఎస్.రవిరాజకుమార్ తెలిపారు. రోడ్డు భద్రత చర్యలపై వట్లూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయాలు, ప్రథమ చికిత్స ఇతర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో పలుచోట్ల వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రాజశేఖర్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12: జిల్లాలో పోలీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకూ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, లాడ్జీలలో అనుమానాస్పదంగా ఉన్న వారిని ప్రశ్నించారు. ప్రార్థనాలయాలు, బ్యాంకులు, ఏటీఎంల వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా రాత్రిపూట ఆ ప్రాంతాలను కూడా తనిఖీ చేశారు. గంజాయి, సారా, మద్యం రవాణా జరుగకుండా విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు.

సేంద్రియ కూరగాయలతో సంపూర్ణ ఆరోగ్యం



ఆర్గానిక్ కూరగాయల స్టాల్ ప్రారంభిస్తున్న కమిషనర్

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 12: సేంద్రియ సాగుతో పండించిన ఆకుకూరలు, కూరగాయల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయల స్టాల్‌ను కమిషనర్ సోమవారం ప్రారంభించారు. సేంద్రియ సాగును ప్రోత్సహించడానికి నగరంలో ఖాళీ స్థలాలను కేటాయిస్తామని, ఆసక్తి గల రైతులు సంప్రదించాలన్నారు. ప్రజారోగ్యం, పర్యావరణాన్ని కాపాడాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రకృతి వ్యవసాయాధికారి సుబ్బరాజు, సతీష్, సౌందర్య, రమ్యశ్రీ, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 12: ప్రజాసమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీటీసీలు కోరారు. ఎంపీపీ రామారావు అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సమావేశం జరిగింది. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గ్రామాల్లో సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంటుందని, డ్రైనేజీలు పూర్తిగా పాడై దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. పలు గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జగనన్న ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారికి త్వరితగతిన ఇళ్లు మంజూరు చేయాలని సభ్యులు కోరారు. సమావేశంలో జడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, గంగరాజు, ఎంపీటీసీ గంటా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీచేసిన ఎంపీడీవో

లింగపాలెం, ఫిబ్రవరి 12: భోగోలు ఐసీఎం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో రాంబాబు సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాల భవనం మరమ్మతులకు గురైందని, ఈ పోలింగ్ కేంద్రాన్ని మార్చాలని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.









ఏలూరు నగర పాలక సంస్థ, చింతలపూడి, జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి కార్మికుల నిరసన

కలెక్టరేట్ వద్ద ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల ధర్నా

మున్సిపల్ కార్మికుల నిరసన

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 12: మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ఇటీవల చేసిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చి హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో మళ్లీ ఉద్యమంలోకి వెళ్తామన్నారు.

● చింతలపూడి: మునిసిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు జీవో రూపంలో విడుదల చేయడంలో జాప్యాన్ని నిరసిస్తూ చింతలపూడి మునిసిపల్ కార్మికులు సోమవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఏఐటీయూసీ రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా నిరసనలో మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు. మండల శాఖ అధ్యక్షురాలు వెలగాడి అనురాధ మాట్లాడుతూ జనవరి 3 నుంచి 10 వరకు మునిసిపల్ కార్మికులు సమ్మె చేయగా ప్రభుత్వం చర్చలకు పిలిచి రూ.21 వేలకు జీతం పెంచుతున్నామని చెప్పి ఇప్పటివరకు ఉత్తర్వులు విడుదల చేయలేదన్నారు. పండుగ అలవెన్సు రూ.వెయ్యి ఇస్తామని జీవో విడుదల చేసి అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఒప్పుకున్న విధంగా సమస్యలు పరిష్కరించకపోతే దశల వారీ ఆందోళన చేపడతామని, మంగళవారం మునిసిపల్ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. మునిసిపల్ కార్మిక నాయకుడు శ్రీరామ్ వెంకటయ్య, పార్వతి, బొత్స సత్యనారాయణ, పుల్లయ్య, సాయమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు విఘ్నేశ్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల పాటు దశల వారీ నిరసనలో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినట్లు చెప్పారు. మున్సిపల్ కార్మికులు సమ్మె విరమించి రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికీ కార్మికులకు జనవరి నెల జీతాలు ఇవ్వలేదని, పెండింగ్‌లో ఉన్న ఎరియర్స్ చెల్లించలేదని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి బొక్క శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఇంగుర్తి నాగరాజు, చాపల రమేష్, కలపాల యేసు, సోమయాజుల వీరప్రసాద్, ముప్పిడి శ్రీను, పొడుదోలు రమణ, కొత్తూరి ఎమిలేశ్వరరావు, యడ్లపల్లి ప్రసాద్, దోసూరి నాగరాజు, ఎన్.సుబ్బారావు, అయినాల ముత్యాలరావు, ప్రసాద్, అప్పలస్వామి, వీర్రాజు, కన్నూరు రాంబాబు, ముప్పిడి నాగేశ్వరావు తదితర కార్మికులు పాల్గొన్నారు.

ఆటోలు, ట్యాక్సీలపై ఈ-చలానాలు రద్దుచేయాలి

ఏలూరు కలెక్టరేట్: ఆటోలు, ట్యాక్సీలపై ఈచలానాలు రద్దుచేయాలని ఏఐఆర్‌టీ డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ఆటోలు, కార్లతో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. నగరంలో ఆటోలు, ట్యాక్సీలు ఇతర వాహనాలపై విధించిన ఈ-చలానాలను రద్దుచేయాలని నినాదాలు చేశారు. రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జె.గోపి మాట్లాడుతూ పాత బస్టాండు సిగ్నల్ పాయింట్, స్టాప్ లైన్, సీసీ కెమెరాలు సరైన క్రమపద్ధతిలో లేవన్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లపై రూ.300 నుంచి రూ.20వేల వరకు ఈ-చలానా విధించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్యాక్సీ ఆటో, డ్రైవర్లకు వాహనమిత్ర పేరుతో రూ.10వేలు ఇచ్చి చలానాలు, డీజిల్ ధరల్లో లక్షకుపైగా గుంజు కుంటోందని విమర్శించారు. తక్షణం ఈ చలానా రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాగసూరిబాబు, దుర్గారావు, మెరుగు రాఘవ, వల్లూరి ఆంజనేయులు నాయకత్వం వహించారు.



ఏపూరులో చింతమనేని ప్రభాకర్ ప్రచారం



రామానుజపురంలో భవిష్యత్ గ్యారెంటీ ప్రచారం



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి



జంగారెడ్డిగూడెంలో కరపత్రాల ఆవిష్కరణ

దగా ప్రభుత్వం

అమ్మఒడి పేరుతో తల్లిదండ్రులకు మోసం

భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రచారంలో టీడీపీ నేతలు

పెదపాడు, ఫిబ్రవరి 12 : అమ్మఒడి పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను జగన్ దగా చేశారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏపూరులో సోమవారం జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో చింతమనేని మాట్లాడుతూ అమ్మఒడి పేరుతో తల్లులను మోసం చేసి జగన్ గద్దెనెక్కారన్నారు. అటువంటి మోసగాడిని గద్దె దించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర నిర్వహించి చంద్రన్న అందించబోయే ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ప్రతి బిడ్డకు ఏడాదికి రూ.15 వేలు సాయం అందిస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఒక బిడ్డకే ఇస్తానని మాట మార్చడం జరిగిందన్నారు. చంద్రబాబు తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఏడాదికి రూ.15 వేలు అందించబోతున్నారన్నారు. అనంతరం వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పలువురికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మోరు శ్రావణి, ఉప్పలపాటి రాంప్రసాద్, గుత్తా అనిల్, గారపాటి రామసీత, వేమూరి శ్రీనివాసరావు, లావేటి శ్రీనివాసరావు, కొత్తూరు చిన్నబాబు, మట్టా శ్రీనివాసరావు, బెక్కం లక్ష్మీనారాయణ, పావులూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతుందని టీడీపీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. రామనుజపురంలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలన్నీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని, మౌలిక సదుపాయాల కల్పనలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గుంతల రహదారుల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్, రాంబాబు, రామారావు, ఎంపీటీసీ చిన్నబ్బి, యర్రమళ్ళ రాజు, శ్రీను, షేక్ సుభాని, తదితరులు ఉన్నారు.

● కామవరపుకోట: లోకేశ్ నిర్వహిస్తున్న శంఖారావం పాదయాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ అన్నారు. పాతూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలతో ప్రజల్లో టీడీపీ, జనసేన కూటమికి ఆదరణ పెరిగిందన్నారు. అన్ని వ్యవస్థలు నిర్వీర్యం కావడంతో ప్రజలు అసహనంతో ఉన్నారన్నారు. ఆయన వెంట గుంటుపల్లి సర్పంచ్ గోరింక దాసు, సత్యనారాయణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ ఫర్ సీబీఎన్ ప్రచార కార్యక్రమం

● జంగారెడ్డిగూడెం టౌన్: చంద్రబాబు పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత జగన్ రెడ్డి పాలనా వైఫల్యాలపై యువ ఓటర్లకు అవగాహన కల్పించడమే లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాం చంద్రశేషు అన్నారు. 'నా మొదటి ఓటు అభివృద్ధికే- నా మొదటి ఓటు చంద్రబాబుకే' ప్రచార కార్యక్రమాన్ని కౌన్సిలర్ కరుటూరి రమాదేవి ఇంటి వద్ద మండవ లక్ష్మణరావు, నంబూరి రామచంద్రరాజు, పరిమి సత్తిపండు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సాయిల సత్యనారాయణతో కలసి శేషు ప్రారంభించారు. మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో కొత్తగా నమోదైన యువ ఓటర్లకు గతంలో జరిగిన అభివృద్ధి ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పరిస్థితి వివరిస్తామన్నారు. యువ ఓటర్లను మొదటిసారి ఓటు హక్కు వినియోగించే యువతను తెలుగుదేశం పార్టీకి ఓటు వేసే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. యువ ఓటర్లతో ముఖాముఖి నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంపా రాజేంద్ర, కోనేటి చంటి, గెడా సుబ్రహ్మణ్యం, తాళ్లూరి వెంకటేశ్వరరావు, మన్యం దుర్గారావు, పోలవరం యువ నాయకుడు బొబ్బర రాజు, గోలి అనిల్, లాగు రాజ్‌కుమార్, పులపాకుల విజయ్ పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ కూటమితో రాష్ట్రాభివృద్ధి



సమస్యలు తెలుసుకుంటున్న ధర్మరాజు

ఉంగుటూరు, ఫిబ్రవరి 12: జనసేన, టీడీపీ కూటమితో రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని బొమ్మిడిలో సోమవారం ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పంది రాంబాబు, మద్దాల వాసు, యాతం పండు, నేదూరి మురళి, పల్లి కాంతయ్య, మద్దాల నాగబాబు, ఇంటి మంగరాజు, సూరత్తుల అయ్యప్ప, పడాల పండు, తాడిశెట్టి శివ, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో జనసేన ప్రభంజనం ఖాయం



బాలరాజుకు నాయకుల సత్కారం

టి.నరసాపురం, ఫిబ్రవరి 12: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీ ప్రభంజనం ఖాయమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్రి బాలరాజు అన్నారు. తెడ్లం గ్రామంలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తల సమావేశం అడపా నాగరాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. బాలరాజు మాట్లాడుతూ జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. టికెట్ ఎవరికి వచ్చిన సమన్వయంతో పని చేయాలన్నారు. కరాటం సాయి, గడ్డమడుగు రవికుమార్, దిరిశాల బ్రహ్మం, సంజయ్, దామోదర్ చౌదరి, బండి శ్రీనివాసరావు, గంధ్ర కృపాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 12: ఉద్యమ నాయకులను హౌస్‌అరెస్టులు చేసినంత మాత్రాన ఉద్యమాలు ఆగవని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. మంగళవారం విజయవాడలో తమ సమస్యలు పరిష్కరించాలంటూ విద్యుత్ ఉద్యోగులు ధర్నా చేస్తున్నారని అన్నారు. ఈ ధర్నాకు వెళ్ళకుండా సీఐటీయూ కార్యాలయంలో తనను నిర్బంధించారని అన్నారు. పోలీసులు హౌస్‌అరెస్టు చేసినట్లుగా నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామికమని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతీ ఒక్కరికి ఉందని ఆ హక్కును వైసీపీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు.

జిల్లాలో పాడి రైతులకు ఉత్తమ సేవలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 12: పాడిరైతులకు ఉత్తమ సేవలందించడంలో జిల్లా నాలుగో స్థానంలో ఉందని పశుసంవర్ధ శాఖ జేడీ జీ.నెహ్రూ బాబు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా పాడి రైతులకు ఉత్తమ సేవలందిస్తున్నామన్నారు. పశువులకు తగిన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామీణ పశువైద్యశాలలు, డిస్పెన్సరీల్లో వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. సబ్సిడీపై గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. పశువులకు మూడేళ్ల బీమా అమలు చేస్తున్నామన్నారు.

42 వేల డస్ట్‌బిన్‌లు పంపిణీ

చింతలపూడి, ఫిబ్రవరి 12: మండలంలోని 19 గ్రామాల్లో 42 వేల డస్ట్‌బిన్‌లు సోమవారం పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏఎంసీ చైర్మన్ జె.జానకీరెడ్డి, ఎంపీపీ బి.రాంబాబు వీటిని పంపిణీ చేశారు. ఎంపీడీవో చినరత్నాలు, ఈవోఆర్‌డి లక్ష్మి పాల్గొన్నారు.

బడేటి చంటి జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు చెబుతున్న టీడీపీ నేతలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 12: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పుట్టిన రోజు వేడుకలు క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు చంటికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, నారా శేషు, జాలా బాలాజీ, దాసరి ఆంజనేయులు, తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి వలవల బాబ్జీ, పోలవరం ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 235 అర్జీలు స్వీకరణ

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 12: కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో అధికారులకు 235 అర్జీలు అందాయి. డీఆర్వో డి.పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు, హౌసింగ్ పీడీ కె.రవికుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీతో కలిసి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీ అధికారులు పరిశీలించి సకాలంలో అర్జీదారుడికి పరిష్కారం చూపాలని తెలిపారు.

మోసగాళ్ళ మాటలు నమ్మవద్దు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసగించే వారితో జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ జి.స్వరూపరాణితో కలసి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి 57 మంది అర్జీలు అందజేశారు. వాటిని పరిశీలించిన ఎస్పీ, ఏఎస్పీ అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ సిఫార్సులతో ఉద్యోగాలు రావని ఉద్యోగం కోసం నిర్వహించే ప్రామాణిక పరీక్షలలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఉద్యోగావకాశాలు కలుగుతాయన్నారు.

పులి దాడి బాధిత రైతులకు నష్టపరిహారం

పోలవరం, ఫిబ్రవరి 12: పులి దాడి బాధిత పాడి రైతులకు నష్టపరిహారం చెల్లించినట్లు అటవీక్షేత్రాధికారి ఎస్.దావీదురాజు సోమవారం తెలిపారు. ఇటీవల కొవ్వాడలో పులి దాడిలో ఆవు చనిపోవడంతో సంబంధిత రైతుకు రూ. 30 వేల పరిహారం అందించామన్నారు. ఉడతపల్లిలో మరో రైతుకు పరిహారం అందించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పులి పాపికొండల అడవుల్లోకి వెళ్ళిపోయిందని, ఏ రేంజ్ పరిధిలో సంచరిస్తుందో అంచనా వేయడం సాధ్యం కాదన్నారు. వన్య మృగాలు, ప్రాణులు జన జీవన ప్రాంతాల్లోకి వస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని, వాటికి హాని కలిగించరాదని ఆయన సూచించారు.

కరాటేలో చింతలపూడి చిన్నారులకు పతకాలు

చింతలపూడి, ఫిబ్రవరి 12 : విజయవాడలో ఈనెల 11న నిర్వహించిన అంతర జిల్లా కరాటే పోటీల్లో చింతలపూడి పాఠశాల విద్యార్థులు 19 పతకాలు సాధించారు. మొత్తం 16 మంది విద్యార్థులు హాజరుకాగా నితీష్, ఆయాన్ స్వర్ణ, జశ్వంత్, హష్రఫ్, కృత్తిక, అక్షిత్‌పాల్ వెండి పతకాలు సాధించారు. మిగిలిన విద్యార్థులు రజిత పతకాలు సాధించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన సుమన్‌రాజును, విద్యార్థులను ప్రిన్సిపాల్ సురేష్, ఏవో రవీంద్ర, ఝాన్సీ విద్యార్థులను, కోచ్‌ను ప్రశంసించారు.

నారాయణపురంలో వెంకన్నకు చక్రస్నానం



చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

ఉంగుటూరు, ఫిబ్రవరి 12: నారాయణపురంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ముగియడంతో భాగంగా సోమవారం చక్రస్నానం నిర్వహించారు. ఏలూరు కాల్వ గట్టు వద్ద స్వామి అమ్మవార్లకు పండితులు మహా శాంతి హోమం, పూర్ణాహుతి, చక్రస్నానం చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.9 లక్షలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 12: ఆర్‌ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం సోమవారం లెక్కించారు. 47 రోజులకు 9,00,626 రూపాయల ఆదాయం లభించినట్టు ఈవో నాగం సన్యాసిరావు తెలిపారు. హుండీ లెక్కింపులో ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు కొండల అరుణకుమారి, తిప్పాని మణి పాల్గొన్నారు.

కొత్తపేట నూకాలమ్మ ఆలయ హుండీ ఆదాయం 43 రోజులకు 1,27,918 రూపాయల ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో నాగం సన్యాసిరావు తెలిపారు. పర్యవేక్షక అధికారిగా ఈవో కూచిపూడి శ్రీనివాస్, కార్పొరేటర్ వెల్లంకి రాజు, సభ్యులు జనపరెడ్డి కనక రాజేశ్వరి కృష్ణ, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఉంగుటూరు :** గొల్లగూడెం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పది పాఠశాలలను సోమవారం నుంచి మూడు రోజుల పాటు తనిఖీ నిర్వహిస్తున్నారు. కైకరం హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం గోపీనాథపట్నం పాఠశాలను పరిశీలించారు.
- గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు. కైకరంలో నిర్మించిన రెండు సచివాలయాలు, రెండు రైతు భరోసా కేంద్రాలను వారు ప్రారంభించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, పుప్పాల గోపి, మరడ మంగారావు, ఎంపిటిసిలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.
- **పెదవేగి :** ఈవోపీఆర్డీగా శ్రీనివాసరావు ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఎంపీడీవో వెంకట రమణ సెలవుపై వెళ్లడంతో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావును ఇన్‌చార్జిగా నియమించారు.
- **లింగపాలెం :** రంగాపురం, ములగలంపాడు గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కుర్రా వెంకట సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, రాయంకుల చక్రధర్‌రావు బీజేపీ చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తాతిన సత్యనారాయణ, మరీదు గంగబాబు, పరసా కిషోర్ పాల్గొన్నారు.
- **పెదపాడు :** పాతపెదపాడు, రాజుపేట, వసంతవాడ గ్రామాల్లో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సోమవారం ప్రజా ఆశీర్వాద యాత్రను నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఘంటా ప్రసాదరావు, అక్కినేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి వుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బొర్రంపాలెంలో కారుమూరి సునీల్, తెల్లం రాజ్యలక్ష్మితో కలసి ఆసరా చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. మండలంలో 1194 గ్రూపుల్లోని 11940 సభ్యులకు రూ.10.79కోట్ల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. జడ్పీటీసీ బాల సూర్యనారాయణ రాజు, ఎంపీపీ డి.లక్ష్మి, వెజ్జు వెంకటేశ్వరరావు, శ్రీను రాజు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.
- **పోలవరం :** డాక్టర్ సుధాకర్ సేవలు ఎనలేనివని మలేరియా సబ్ యూనిట్ అధికారి బొంగు నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన విశ్రాంత వైద్యాధికారి జీవీజీకే.సుధాకర్ సంతాప సభలో పలువురు వైద్య సిబ్బంది మాట్లాడారు. జేవీ. నరసింహరావు, వైద్యులు సతీష్ కుమార్, రాంబాబు, గెడ్డం జ్యోతి, అశోక్, దంతవైద్యులు భార్గవ్, ముత్యాల రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ బంజరులో వన సంరక్షణ సమితులు ఏర్పాటు చేయాలి




ఫారెస్టు రేంజ్ అధికారి ఎస్‌కే వలీకి వినతిపత్రం ఇస్తున్న వనజ, నేతలు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 12: బుట్టాయగూడెం మండలంలో వందల ఎకరాల అటవీ బంజరు భూముల్లో వన సంరక్షణ సమితులు ఏర్పాటుచేసి పేద గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయం వద్ద ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దాలయ్య అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ అధికారి కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి రేంజ్ అధికారి ఎస్‌కే.వలికి వినతి పత్రం సమర్పించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వన సంరక్షణ సమితులు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, జేవీ.రమణ రాజు, ఎం.వెంకటాచారి, బాడిస రాము, నన్నేపల్లి సాయిబాబు, జమ్మి శ్రీనివాస్, కారం దారయ్య, పిట్టా ప్రసాద్, ఐతా సురేష్, మన్నవ యామిని, మరక శ్యామల, గొలిమే బాలఏసు, చాకిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను మూస్తున్న ముళ్లచెట్లు

రహదార్లకు ఇరువైపులా ముళ్లపొదలతో వాహనదారులకు అవస్థలు



గుర్వాయిపాలెం-పెదలంక రోడ్డు వెంబడి దట్టంగా ఉన్న ముళ్ల పొదలు

కలిదిండి, ఫిబ్రవరి 12 : గుర్వాయిపాలెం-పెదలంక ప్రధాన రహదారి, మూల్లంక-మల్లంపూడి ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు దట్టంగా వ్యాపించడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గుర్వాయిపాలెం, సంతోషపురం, రామకృష్ణాపురం, పెదలంక, మూల్లంక, మల్లంపూడి గ్రామాల వరకు రహదారి వెంబడి ముళ్లపొదలు పెరగడంతో వాహనదారులు, బస్సు ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. ఓవైపు ముళ్ల పొదలు, మరోవైపు గోతుల రహదారిపై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముళ్ల పొదలను తొలగించి రహదారిపై గోతులను పూడ్చితేనే బస్సుల రాకపోకలు సాగిస్తామని లేకపోతే బస్సులను నిలుపుదల చేస్తామని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ముళ్లచెట్లు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈఈ అరవింద్‌ను వివరణ కోరగా ఆయా గ్రామాల రహదారి మరమ్మతులు త్వరలో చేపడతాం. ముళ్ల పొదలను తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

కోమర్రు రోడ్డులో ప్రయాణికుల వెతలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 12 : ముదినేపల్లి మండలం కోమర్రు గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ ప్రధాన రహదారి ముళ్ల పొదలతో మూసుకుపోతుంది. గుడివాడ-బంటుమిల్లి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కోమర్రు, చినకోమర్రు మీదుగా బొమ్మినంపాడు వెళ్లే రోడ్డు పలు చోట్ల ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ల చెట్ల వల్ల వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది. ఎదురెదురుగా వచ్చే రెండు వాహనాలు తప్పుకునే అవకాశం లేదు. ఈ దారిలో అయినంపూడి ఓఎన్‌జీసీ స్థలం వరకు భారీ వాహనాలు కూడా వెళ్తుంటాయి. కళాశాలలు, పాఠశాలలకు సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధిక సంఖ్యలో చేపలు, రొయ్యల చెరువులు ఉండడంతో నిత్యం ఎడతెరపి లేకుండా మేతల వాహనాలు వెళ్తుంటాయి. రెండువైపులా చెట్లు పెరిగిపోయి వాలిపోవ డంతో రోడ్డు ఇరుకుగా తయారైంది. పంచాయతీరాజ్ శాఖ అధికారులు కోమర్రు రోడ్డులో ముళ్ల చెట్లను నరికించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ముళ్లచెట్లతో మూసుకుపోయిన కోమర్రు రోడ్డు

టిడ్కో భవనాలను లబ్ధిదారులకు అందించాలి

▸▸ జనసేన నాయకుల రిలే నిరాహారదీక్ష



శిబిరం వద్ద మాట్లాడుతున్న మరీదు శివరామకృష్ణ

నూజివీడు, ఫిబ్రవరి 12: ప్రతి మహిళకు ఈ ఐదేళ్లలో లక్ష రూపాయల వరకు ప్రయోజనం చేకూర్చామని చెబుతున్న వైసీపీ ప్రభుత్వం నూజివీడు పీఎంఏవై, వైఎస్సార్ కాలనీ టిడ్కో లబ్ధిదారులకు లక్ష రూపాయలు నష్టాన్ని చేకూర్చిందని జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ అన్నారు. టిడ్కో భవనాలను లబ్ధిదారులకు తక్షణం అందజేయాలని కోరుతూ సోమవారం జనసేన ఆధ్వర్యంలో నూజివీడు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరాహారదీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారుల నుంచి బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ప్రభుత్వ ఖాతాకు జమ చేసుకున్న రాష్ట్రప్రభుత్వం, రెండేళ్లు దాటినా లబ్ధిదారులకు నివాస గృహాలు అందించలేదన్నారు. సొంతింటివారమవుతామనే ఆశతో లబ్ధిదారుల వాటాను అప్పులు చేసి చెల్లించి వాటి వడ్డీలను కడుతూ బాధలు పడుతుంటే రాష్ట్రప్రభుత్వం బ్యాంకర్ల ద్వారా రుణాలు పొంది లబ్ధిదారులను మరింత అప్పుల ఊబిలోకి నెట్టేసిందన్నారు. తక్షణం టిడ్కో రుణాలను రద్దుచేసి లబ్ధిదారులకు భవనాలు అందించాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలో జనసేన నాయకులు ముత్యాల కామేష్, బండారు రాజు, ఎం.సునీల్, నూజివీడు మండల జనసేన అధ్యక్షుడు యర్రంశెట్టి రాము, రంగు ధనలక్ష్మి, చంద్ర, షేక్ బాజీ, ఎం.జయలక్ష్మి తదితరులు ఉన్నారు. వీరికి నూజివీడు పట్టణ బీజేపీ అధ్యక్షుడు బోను అప్పారావు, టీడీపీ నాయకులు నిరాహారదీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

అడిషనల్ పీపీగా జేడీ గాంధీ



గాంధీ

నూజివీడు, ఫిబ్రవరి 12:నూజివీడు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జంగం దేవదాస్‌గాంధీ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రప్రభుత్వం జారీచేసిన జీవో మేరకు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వారు నియామక ఉత్తర్వులను జారీ చేయడంతో సోమవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారు. 31 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న ఆయన గతంలో నూజివీడు సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో 2005-12వరకు అసిస్టెంట్ గవర్నర్ ప్లీడర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను న్యాయవాదులు, సిబ్బంది అభినందించారు.

నేడు జిల్లా పరిషత్ సమావేశం

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 12: ఏలూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జడ్పీ సమావేశం జరగనున్నది. ప్రస్తుత ప్రభుత్వానికి సంబంధించి ఈ ఏడాది ఇదే చివరి సమావేశం. జడ్పీ పరిధిలో 48 మండలాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇది ఎన్నికల ఏడాది కావడంతో పనుల వేగం కూడా పెంచారు. 48 మంది జడ్పీటీసీ సభ్యులలో 46 మంది అధికార పార్టీ వారే కావడంతో వాడీ వేడి చర్చలకు అవకాశాలు లేవు. సమావేశంలో ప్రధానంగా 2023-24 సంవత్సరానికి బడ్జెట్ సవరణ అంచనాలు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలపై చర్చ, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష ఉంటుందని జడ్పీ సీఈవో సుబ్బారావు తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 12 : పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వర జనార్ధనస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందూధర్మ ప్రచార మహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం సువాసినులకు (ముత్తయిదువులు) పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం భీమవరానికి చెందిన మయూరి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారిచే కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. దేవస్థానం ఈవో కృష్ణంరాజు, ధర్మకర్తలు కూర్మదాసు సత్య శ్రీనివాస్, నాచు శ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు చెల్లబోయిన సూర్యప్రకాష్, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రామకృష్ణ పాల్గొన్నారు.





నూజివీడు బస్టాండ్ ఆవరణలో వైసీపీ 'సిద్ధం' బ్యానర్లు

టీటీడీ స్థలంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జెండాలు

నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఫ్లెక్సీలు

▸▸ ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు.. పట్టించుకోని అధికారులు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 12: నూజివీడు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోనూ, పెద్ద గాంధీబొమ్మ సెంటర్ వద్ద గల తిరుమల తిరుపతి దేవస్థానం స్థలంలోనూ వైసీపీ నాయకుల ప్రచార బోర్డులు, సీఎం చిత్రంతో కూడిన పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నిబంధనల మేరకు ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల వద్ద ప్రభుత్వ పథకాల ప్రచారం నిర్వహించవచ్చు. కాని రాజకీయపార్టీల ప్రచార బోర్డులను అమర్చకూడదు. టీటీడీ స్థలం చుట్టూ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. రాజకీయపార్టీ జెండాలను సైతం కట్టారు. వాస్తవంగా టీటీడీ స్థలాల్లో రాజకీయపార్టీల జెండాలను ఎగురవేయకూడదనే నిబంధన ఉంది. దీనిని ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం. నూజివీడు ఆర్టీసీ ఆవరణలో వైసీపీకి చెందిన సిద్ధం ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై డిపో మేనేజరు పవన్‌కుమార్‌ను వివరణ కోరగా ప్రచార బోర్డులు కాంట్రాక్టర్ నిర్వహణలో ఉంటాయని, వారితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

బస్సు షెల్టర్ వెతలు

చాట్రాయిలో ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

చాట్రాయి, ఫిబ్రవరి 2: చాట్రాయిలో బస్‌షెల్టర్ లేకపోవడంతో నిత్యం ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులు దుకాణాలు, హోటళ్ళ ఎదుట ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళలు, చిన్నపిల్లల బాధలు వర్ణనాతీతం. ఆర్టీసీ బస్సులు ఆపేందుకు స్థలం లేక రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను దించడం, ఎక్కించడం చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రయాణికుల పక్క నుంచి ద్విచక్రవాహనాలు, ఆటోలు వేగంగా దూసుకుపోతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. చాట్రాయి మీదుగా హైదరాబాద్, వైజాగ్, నూజివీడు, తిరువూరు, చింతలపూడి, చీపురుగూడెం, జనార్ధనవరంలకు రోజుకు సుమారు 30 ట్రిప్పులు ఆర్టీసీ బస్సులు నడుస్తుంటాయి. వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నా కనీసం బస్ షెల్టర్ లేకపోవడం ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. 1986లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా చాట్రాయిలో బస్‌స్టేషన్ మంజూరు చేశారు. దీనికోసం 50 సెంట్ల స్థలం సమకూర్చాలని కోరగా స్థానిక నాయకులు స్థలం చూపకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చాట్రాయిలో బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



చాట్రాయి సెంటర్‌లో రోడ్డుపై బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'



కైకలూరులో భవిష్యత్ గ్యారెంటీ పత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

కైకలూరు, ఫిబ్రవరి 12: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు అన్నారు. సోమవారం కైకలూరు పట్టణంలో బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి హామీ పత్రాలను అందజేశారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని అన్నిరకాల ప్రజలు ఆర్థికంగా చిన్నాభిన్నం అయ్యారని, ధరలు విపరీతంగా పెరిగాయని, ఏడుసార్లు విద్యుత్‌చార్జీలు పెంచిన ఘనత జగన్‌దేనన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మి, టీడీపీ జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు కేకే బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి. జానీ, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఎం.డి. ఉస్మాన్, మార్కెట్‌యార్డ్ మాజీ డైరెక్టర్ సయ్యద్ బాషిద్, ఎస్టీఆర్ యువసేన నాయకులు లక్కింశెట్టి మోహన్, ఎస్సీసెల్ నాయకుడు వీరాబత్తిన సుధ, తెలుగు మహిళా కార్యదర్శి శీలం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై శోభనాచల స్వామి



శోభనాచల స్వామి ఊరేగింపు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 12: మాఘమాస రథసప్తమి తిరునాళ్ల సందర్భంగా నిత్యకల్యాణంలో భాగంగా సోమవారం శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి వారు పెద్దకొరాయి నందు కల్యాణార్థం వేంచేశారు. ఉదయం 9 గంటలకు సగర సంఘం వారిచే శాంతికల్యాణం, రాత్రి 8 గంటలకు నిత్యకల్యాణం యాదవ సంఘం వారు నిర్వహించారు. అనంతరం స్వామివారు అశ్వవాహ నంపై నాలుగు మాడ వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కాల్వలకు నీరు విడుదల చేయండి : ఎంపీపీ



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణ

కైకలూరు, ఫిబ్రవరి 12: గ్రామాల్లో మంచినీటి ఎద్దడి రాకుండా కాల్వలకు నీరు విడుదల చేయాలని ఎంపీపీ అడవి వెంకట కృష్ణమోహన్ అన్నారు. సోమవారం కైకలూరులో ఇరిగేషన్ ఎస్ఈ డి.ప్రసాదబాబుతో సమావేశాన్ని ఆటపాక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. రానున్న వేసవి ఎండల దృష్ట్యా కాల్వలకు నీరు విడుదల చేయాలని ఇప్పటికే కైకలూరు నియోజకవర్గంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని అధికారులు సమన్వయంతో నీరు విడుదల చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ రవిశంకరరావు, పంచాయతీ కార్యదర్శులు రవికిరణ్, డి.వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయాలని నిరసన



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 12:ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ ఇవ్వాలని కోరుతూ ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన పలువురు సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) ముసునూరు మండల కార్యదర్శి వేముల బక్కయ్య మాట్లాడుతూ 1996లో రమణక్కపేట పంచాయతీ పరిధిలో ప్రభుత్వం ఇళ్ళస్థలాలను మంజూరు చేసిందని, నాడు పొజిషన్ చూపించకపోవడంతో ఎవరూ ఇళ్ళు కట్టుకోలేకపోయారని, ప్రస్తుతం అదేప్రదేశంలో గతంలో ఇచ్చిన వారికే తిరిగి ఇళ్ల స్థలాలు ఇచ్చినందున సదరు ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలన్నారు. అఖిలభారత ప్రగతిశీల మహిళాసంఘం, సీపీఐ (ఎంఎల్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, మహిళా సంఘం సభ్యులు పల్లి భవానీ, నందిపాం రాణి, దారా బేబి, షాలిని, ఆముదాల పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో రెండు తలల పాము



పోలవరం, ఫిబ్రవరి 12 : పోలవరం బీసీ కాలనీలో సోమవారం రాత్రి అరుదైన రెండు తలల పాము హల్‌చల్ చేసింది. పోలవరం పంచాయతీ బీసీ కాలనీలో వైసీపీ నాయకురాలు పాతిమున్నీసా ఇంటి వద్ద రెండు తలల పాము కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీశాఖ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని పాముని పట్టుకుని అటవీ క్షేత్రాధికారి ఎస్.దావీదు రాజు ఆదేశాల మేరకు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దావీదు రాజు మాట్లాడుతూ అరుదైన సర్ప జాతికి చెందిన ఈ పాము విషరహిత మైనదని ప్రమాదకారి కాదన్నారు. దీనిని రెడ్ శాండ్‌బోవా అని పిలుస్తారని దానిని సాధారణంగా రెండు తలల పాముగా పిలుస్తారని వాస్తవానికి ఒకే తల ఉండి తోక మొండిగా ఉండడం వలన రెండుతలల పాముగా భ్రమిస్తారన్నారు. అటవీశాఖ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.బాబూరావు, బీట్ ఆఫీసర్ రాజేష్, మధుకర్, గాంధీ పాల్గొన్నారు.

నకుల శ్యామలగా శ్యామలాంబ అమ్మవారు

కైకలూరు, ఫిబ్రవరి 12: కైకలూరు శ్యామలాంబ అమ్మవారు శ్రీశ్యామలా నవరాత్రుల సందర్భంగా సోమవారం నకుల శ్యామలగా దర్శనమిచ్చారు. కైకలూరుకు చెందిన పెరుమాళ్ళ జలదుర్గ ప్రసాదరావు దంపతులు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు వారి ఇళ్ళ వద్ద అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రతీరోజు అలంకరించి పూజలు చేస్తున్నారు. ఆలయంలో ఈవో వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించి భక్తులకు ఉచిత ప్రసాదాన్ని అందజేశారు. మంగళవారం హసంతి శ్యామలగా దర్శనమిస్తారని తెలిపారు.

పెద్దింట్లమ్మవారికి వెండి కిరీటం



4.866 కేజీల వెండి కిరీటాన్ని అందిస్తున్న దాతలు పిచ్చయ్య, కుటుంబసభ్యులు

కైకలూరు, ఫిబ్రవరి 12: కొల్లేటికోట శ్రీపెద్దింట్లమ్మవారికి వెండి కిరీటాన్ని దాతలు అందజేశారు. సోమవారం పెద్దింటి అమ్మవారికి గుంటూరుకు చెందిన ఎన్.పిచ్చయ్య వారి కుటుంబసభ్యులు 4.866 కేజీల వెండి కిరీటాన్ని కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా కిరీటాన్ని ఆలయ అధికారి కేవీ గోపాలరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

16న బంద్‌ను విజయవంతం చేయాలి



ప్రచార కార్యక్రమం ఐఎఫ్‌టీయూ నాయకులు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 12: భారతదేశ గ్రామీణబంద్, పారిశ్రామిక సమ్మెను ఈనెల 16న విజయవంతం చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలనీలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేసే వరకు యావత్ కార్మికవర్గం ఉద్యమాలకు సన్నద్ధం కావాలన్నారు. రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధర చట్టం తీసుకువచ్చేందుకు పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి మానికల నాగరాజు, నిర్మాణ రంగ కార్మిక నాయకులు గౌరీనాయుడు, సురేష్, తిరుపతి, సంఘం నాయుడు పెద్ద నాగరాజు, రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రిజరేషన్లు అమలు చేయాలి



రమణక్కపేటలో ఆందోళన చేస్తున్న నాయకులు

ముసునూరు, ఫిబ్రవరి 12:రాజ్యాంగబద్ధంగా మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. సోమవారం అఖిల భారత ప్రగతిశీల మహిళాసంఘం 30వ వ్యవస్థాపక దినోత్సవాన్ని రమణక్కపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై అనేక దాడులు జరుగుతున్నప్ప టికి మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతి శీల మండల అధ్యక్షురాలు రాణి మాట్లాడుతూ దేశంలో మద్యం ఏరులైపారుతోం దని, తాగుబోతులు మహిళలపై విచ్చలవిడిగా దాడులు చేస్తున్నారని, మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దారా బేబి, పల్లిపాము భవాని, ఆముదాల పుష్పలత, ఉయ్యూరు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : ఎమ్మెల్యే



పైపులైన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్ఆర్

ముదినేపల్లి, ఫిబ్రవరి 12:గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ముదినేపల్లిలో నిర్మించిన మైక్రో ఫిల్టర్ పైపులైన్లను, అన్నవరంలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, దాకరం, తేరగూడెం గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి, ముదినేపల్లిలో రూ.30 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, అంతర్గత రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఎంపీడీవో గంగాధరరావు, సర్పంచ్‌లు నిమ్మగడ్డ కైకమ్మ, అల్లు సుశీల, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో గోవిందరాజులు మృతి



గోవిందరాజులు (ఫైల్)

ముదినేపల్లి, ఫిబ్రవరి 12 : ముదినేపల్లి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కరేటి గోవిందరాజులు (54) గుండెపోటుతో సోమవారం ఆకస్మి కంగా మరణించారు. వారం రోజులుగా ఆయన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మూడు రోజుల క్రితం ఆయన కోడలు మరణించిన విషాదం నుంచి కుటుంబం కోలుకోక ముందే ఆయన మరణించడంతో బొమ్మినంపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన బొమ్మినంపాడు గ్రామ సర్పంచ్‌గా గతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మరణం పట్ల ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎంపీపీలు రామిశెట్టి సత్యనారాయణ, చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఏవో వేణుమాధవ్, శీలం రామకృష్ణ, బొప్పన సుందరరామయ్య సంతాపం తెలిపారు.

సుపరిపాలన మోదీకే సాధ్యం



చనుబండలో పల్లెకుపోదాం కార్యక్రమం

చాట్రాయి, ఫిబ్రవరి 12: దేశానికి సుపరిపాలన అందించటం ప్రధాని నరేంద్ర మోదీకే సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా, మండల కన్వీనర్ ఆదిమూలం నాగ మోహనశర్మ అన్నారు. సోమవారం చనుబండ, సూరంపాలెం, నరశింహారావుపాలెం, సి.గుడిపాడు, పర్వతాపురం, చిన్నంపేట, కోటపాడు గ్రామాల్లో పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ కన్వీనర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫారసులు అమలు చేయండి

చాట్రాయి, ఫిబ్రవరి 12: హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వటం హర్షణీయమే కానీ, ఆయన సిఫారసుల మేరకు కేంద్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర ఎందుకు కల్పించడం లేదని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి. హరనాథ్ ప్రశ్నించారు. సోమవారం విలేకరులతో ఆయ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక, కార్పొరేట్‌కు అనుకూల విధానాలు అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం వల్ల కార్పొరేట్ గుత్తాధిపత్యం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 16న జరిగే గ్రామీణ బంద్‌లో రైతులు, వ్యవసాయ కూలీలు కార్మికులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

హాస్య సన్నివేశాలతో జబర్దస్త్ టీం సందడి



జబర్దస్త్ నటుల హాస్య సన్నివేశం

కలిదిండి, ఫిబ్రవరి 12 : మండలంలోని కలిదిండి, మూల్లంక, కొండంగి, కోరుకొల్లు గ్రామాల్లో సోమవారం బీజేపీ తరఫున జబర్దస్త్ కళాకారులు హాస్య సన్నివేశాలతో ప్రచారం చేస్తూ సందడి చేశారు. 2008 నుంచి తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి సీతారామాంజనేయ చౌదరి చేస్తున్న సేవలను వివరిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. తొలుత మూల్లంకలో జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, అప్పారావు, బాబీ, వినోద్, ఇమ్మానియేలు తనదైన శైలిలో హాస్యభరిత ప్రదర్శనల ద్వారా స్థానికులను నవ్వించారు. సినీ గాయకులు లాస్యప్రియ, అరుణ్ కౌండిన్య సినీ గీతాలతో యువతను ఉత్సాహపరిచారు. కిసాన్ మోర్చ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కీర్తి రాంప్రసాద్, మండల అధ్యక్షుడు నంబూరి బాందురాజు, నాయకులు దున్న రామలింగేశ్వరరావు, గుత్తుల రాము, కోకా శ్రీనివాస్, బి.వెంకట రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ మంత్రి కామినేని ఆత్మీయ సమావేశాలు

కలిదిండి, ఫిబ్రవరి 12 : మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ మంగళవారం కలిదిండి మండలం పడమటిపాలెం, గుర్వాయిపాలెం గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తారని కామినేని వ్యక్తిగత సహాయకుడు సత్యనారాయణ రాజు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు పడమటిపాలెం, 5 గంటలకు గుర్వాయిపాలెం జరిగే కార్యక్రమాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గోవులకు గ్రాసం అందజేత



గోవులకు గ్రాసం అందజేస్తున్న దాతలు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 12: శ్రీశోభనాచల లక్ష్మీనృసింహ వేదపాఠశాలలో గల గోశాలలోని గోవులకు పలువురు దాతలు రూ.25వేలు విలువగల గ్రాసం సమర్పించారు. పామర్తి రామాంజనేయులు, చనుమోలు విజయ్‌కుమార్, పామర్తి వాసు, పామర్తి పరుసురాం, చీపి శ్రీనివాసరావు, పలగాని విద్యాధర్‌రావు, ఈగ్రాసం (వరిగడ్డి) అందజేసిన వారిలో ఉన్నారు. వేదపాఠశాల కార్యదర్శి సూరిశర్మ వీరికి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యశాలకు రూ.10వేలు అందజేత

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 12: ఆగిరిపల్లి మండల వాసవీ మహిళామండలి సంఘం వారు ఆగిరిపల్లి ప్రభుత్వవైద్యశాలలో ప్రసూతి సమయంలో గర్భిణులకు ఉపయోగపడే టేబుల్ సమకూర్చే నిమిత్తం రూ.10వేలు చెక్కు అందజేశారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ విరాళం వాసవీ సంఘం వారు అందజేశారు. కార్యక్రమంలో యండూరి భవాని, మదుపల్లి కల్పన, తవ్వా వాణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలకు చర్యలు



చెక్కపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ముసునూరు, ఫిబ్రవరి 12: రానున్న ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా సకల సదుపాయాలను కల్పించేం దుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ జవహర్ బాజీ, ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి, ఎస్ఐ పి.వాసు తెలిపారు. సోమవారం మండలంలోని చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో ఉన్న ఎనిమిది పోలింగ్ కేంద్రాలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కల్యాణమస్తు బంగారు నాణెం అందజేత



బంగారు నాణెంను అందిస్తున్న దృశ్యం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 12: నూజివీడు మండలం అన్నవరం శివారు వెంకటాద్రిపురం పాలసొసైటీలో పాడిరైతు గుంటక వెంకటలక్ష్మి కుమారుడి వివాహాన్ని పురస్కరించుకుని కృష్ణా మిల్క్ యూనియన్ ప్రవేశపెట్టిన కల్యాణమస్తు పథకంలో భాగంగా రూ.20వేలు విలువైన బంగారు నాణాన్ని లబ్ధిదారునికి అందించారు. గుంటక వెంకటలక్ష్మి కుమారుడు వివాహానికి సంబంధించి బంగారు నాణాన్ని కృష్ణామిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు శెనగల వెంకటశివజ్యోతి లాంఛనంగా లబ్ధిదారునికి అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పొన్నగంటి గణేష్, వేతన కార్యదర్శి రామకృష్ణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.